

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ఆందోళన

- రాజయ్యపేటలో నిరసన ప్రదర్శన
- చిరు వ్యాపారికి రూ.63,996 విద్యుత్ బిల్లు
- ఎలా చెల్లించగలడని నాయకుల మండిపాటు

- 8లో



రోడ్లకు మోక్షం ఎన్నడో?

పలుచోట్ల నిధులు మంజూరైనా ప్రారంభం కాని నిర్మాణ పనులు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు కాంట్రాక్టర్లు
- వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్న రహదారులు
- ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన



బుచ్చెయ్యపేట మండలం ఎల్.సింగవరంలో నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గోతులమయమై అధ్వానంగా మారిన పలు తారురోడ్ల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో పలుచోట్ల ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పలు రోడ్లకు పునర్నిర్మాణ నిధులు మంజూరుకే పరిమితమయ్యాయి. కొన్ని రోడ్ల పనుల విషయంలో కాంట్రాక్టర్ల జాప్యం కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. మరికొన్ని రహదారులకు గతంలో చేసిన పనులకే బిల్లులు అందలేదని, కొత్తగా పనులు చేపడితే తాము నష్టపోతామంటూ కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో చోడవరం నుంచి వయా వడ్డాది బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల మీదుగా బీఎన్ రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. అడుక్కో గొయ్యి ఉండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడం నరకాన్ని తలపిస్తోందని స్థానికులతో పాటు పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట మండలం ఎల్.సింగవరం రోడ్డుపై భారీ గుంతలను తాత్కాలికంగా కప్పేసి మమా.. అనిపించారు. టెండర్లపై పనులు చేజిక్కించుకున్న పలువురు కాంట్రాక్టర్లు రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనకాపల్లి నుంచి వెంకన్నపాలెం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల పొడవునా ఆర్అండ్‌బీ రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. నర్సీపట్నం నుంచి రేవుపోలవరం రోడ్డు, వడ్డాది నుంచి తాటిపర్తి వరకు గల రహదారి పరిస్థితి అంతే. సుమారు 13 కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డు పనులను గతనెలలో కాంట్రాక్టరు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశాడు. అలాగే చోడవరం నుంచి వడ్డాది వరకు బీఎన్ రోడ్డు పనులను అరకొరగా చేపట్టి వదిలేసి నెలలు గడుస్తున్నా మోక్షం లభించడం లేదు. ఈ పనుల నిర్వహణ బాధ్యతలను అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే చేజిక్కించుకున్నా పనులు మాత్రం చేపట్టడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు మీదుగా వయా వడ్డాది మాడుగుల, తాటిపర్తి మీదుగా పాడేరు రాకపోకలు సాగించే వాహనదారులు గత వైసీపీ ప్రభుత్వంలో పడిన కష్టాలనే మళ్లీ అనుభవిస్తున్నారు. గుంతలమయమైన రహదారులపై రాకపోకలు సాగించడం వల్ల తమ వెహికల్స్ తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు.



పనులు నిలిచిన వడ్డాది-తాటిపర్తి రోడ్డులో ఎ.కోడూరు వద్ద పరిస్థితి

ఫిర్యాదులు చేసినా ఫలితం లేదాయె..

జిల్లాలోని రహదారుల దుస్థితిపై అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చోడవరం నుంచి వడ్డాది రోడ్డు బాగు చేయాలని కొందరు న్యాయవాదులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. జిల్లాలోని రోడ్ల దుస్థితిపై తగిన చర్యలు చేపట్టవలసిందిగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇటీవల స్వయంగా సీఎం చంద్రబాబునాయుడును కలిసి కోరారు. రోడ్లను బాగు చేయాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. కాగా రహదారుల దుస్థితిపై ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ విశాఖ

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీకి జాతీయ స్థాయి మినిస్టీరియల్ అవార్డు
- 19న ఢిల్లీలో అధికారికంగా ప్రకటన



విశాఖ సిటీ వ్యూ

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు జాతీయ స్థాయిలో ప్రత్యేక కేటగిరీలో మినిస్టీరియల్ అవార్డు లభించింది. ఢిల్లీలో ఈనెల 19న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పంపిణీ కార్యక్రమం జరగనున్నది. అదేరోజు ఫలితాలను అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా ఢిల్లీలో 19న జరిగే అవార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలంటూ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావులకు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ అధికారుల నుంచి ఆహ్వానం అందింది.

కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలను నిర్వహిస్తోంది. అయితే ఏటా మాదిరిగా కాకుండా ఈ ఏడాది భిన్నంగా నిర్వహించింది. జాతీయ స్థాయిలో ఏటా మూడు నగరాలే మొదటి మూడు స్థానాలను దక్కించుకుంటుండడంతో వాటిని ఈ ఏడాది పోటీ నుంచి మినహాయించారు. దీంతో పది లక్షలకు పైబడిన జనాభా కేటగిరీ నగరాల్లో విశాఖకు ఒకటి లేదా రెండో ర్యాంకు దక్కుతుందని అధికారులు ఆశిస్తున్నారు. అయితే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ శనివారం నగర పర్యటనకు వచ్చినప్పుడు జీవీఎంసీకి ప్రత్యేక కేటగిరీలో మినిస్టీరియల్ అవార్డు లభించిందని ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో ... మిగతా 8వ పేజీలో

చెరకు రైతులకు సాయం ప్రశ్నార్థకం?

ఏటా రైతులకు చెరకు అభివృద్ధి మండలి ద్వారా పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు సరఫరా

- ఈ ఏడాది అరకొర బడ్జెట్‌తోనే సరిపెట్టిన వైనం
- గోవాడలో క్రషింగ్ ఆధారంగానే మండలికి నిధులు
- ఈ ఏడాది తగ్గిన క్రషింగ్
- వచ్చే సీజన్‌లో రైతులకు సబ్సిడీ సరకుల సరఫరా లేనట్టే?



పురుగు మందులు, మడత పైపుల కోసం చోడవరంలోని చెరకు అభివృద్ధి మండలి కార్యాలయానికి వచ్చిన రైతులు

చోడవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

ఏటా ఖరీఫ్ సీజన్‌లో చెరకు రైతులకు పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, మడత పైపులు, గడ్డి మందులు సబ్సిడీ ధరకు అందించే చోడవరం చెరకు అభివృద్ధి మండలి సహకారం ప్రశ్నార్థకంగా మారింది. ఏటా గోవాడ సభ్య చెరకు రైతులకు చెరకు అభివృద్ధి మండలి ద్వారా మడులకు నీరు పెట్టేందుకు అవసరమైన మడత పైపులు, పురుగు మందులు, రైతులు ఎక్కువగా ఉపయోగించే గడ్డి మందు, గమాక్సిన్, ఇతర మందులు అందించేవారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతుల కోసం ఏటా ఫ్యాక్టరీ నిర్వహించే క్రషింగ్‌కు చెరకు సరఫరా చేసే రైతుల నుంచి టన్నుకు రైతుల నుంచి రూ.4 వసూలు చేసి, దానికి ఫ్యాక్టరీ తరఫున రూ.4 కలిపి టన్నుకు 8 రూపాయల చొప్పున చెరకు అభివృద్ధి మండలికి కేటాయించడం ఆనవాయితీ. ఇలా ఏడాదిలో ఎన్ని టన్నులు క్రషింగ్ చేస్తే ఆ మేరకు వచ్చిన నిధులను గోవాడ ఫ్యాక్టరీ ఈ చెరకు అభివృద్ధి మండలికి కేటాయించేది. చెరకు అభివృద్ధి మండలి అధికారులు ఈ నిధులతో ప్రతిఏటా రైతులు ఎక్కువగా ఉపయోగించే పురుగు మందులు, ఇతర వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వాటిని తక్కువ ధరకు అందించేది. ఏటా సీజన్ ముందు చెరకు అభివృద్ధి మండలి ద్వారా అందే సరకులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు దొరకుతుండడం వల్ల ఇక్కడ మడత పైపులు, గడ్డి మందు, ఇతర పురుగు మందులకు రైతుల నుంచి గిరాకీ ఎక్కువగానే ఉంటుంది. స్థూలంగా ఈ చెరకు అభివృద్ధి మండలి ద్వారా రైతులకు అంతో ఇంతో వ్యవసాయ సీజన్‌లో సహకారం ఉండేది.

తగ్గిపోయిన సహకారం

ఏటా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆడే క్రషింగ్ మీద ఆధారపడి ఈ చెరకు అభివృద్ధి మండలి బడ్జెట్ ఉండేది. గతంలో ఏడాదికి 5 లక్షల టన్నులు ఆడితే చెరకు అభివృద్ధి మండలికి రూ.40 లక్షల ఆదాయం వచ్చేది. దీంతో రైతులకు బాగానే సరకులు పంపిణీ చేసేవారు. అయితే ... మిగతా 8వ పేజీలో

వానాకాలంలో వడగాడ్పులు

రోజురోజుకు వేడెక్కుతున్న వాతావరణం

- ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు




జన సందడి లేని నెహ్రూ చౌక్

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి పట్టణంలో వాతావరణం మండు వేసవిని తలపిస్తోంది. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కుతోంది. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వానాకాలంలో ఈ వడగాడ్పులు ఏమిటని ప్రజలు వాపోతున్నారు. గత వారంలో కేవలం 34 డిగ్రీల లోపు ఉండే ఉష్ణోగ్రతలు ఈ నెల 9వ తేదీన 35 డిగ్రీలు, 10న 36 డిగ్రీలకు, 11న 37.1, 12వ తేదీ శనివారం 37.5 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. దీంతో ఎండ వేడిమికి తాళలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉష్ణతాపం ప్రారంభం కావడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వడగాడ్పుల కారణంగా రహదారులపై జనసంచారం పలుచబడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. పలు సందర్భాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుండడంతో ప్రజలు ఇళ్లల్లో ఉండలేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్‌ల కింద కూర్చున్నా చెమటలు పడుతున్నాయంటే ఉష్ణతాపం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏదిఏమైనా ప్రస్తుతం వర్షాలతో చల్లగా ఉండాల్సిన వాతావరణం రోజురోజుకు వేడెక్కుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలు?

- రెండు రోజుల సెలవుల నేపథ్యంలో పలువురు వ్యాపారులు తవ్వకాలు జరిపినట్టు అనుమానాలు



కరక రంగురాళ్ల కొండ

నర్సీపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలు జరిగినట్టు తెలిసింది. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కలిసిరావడంతో అటవీశాఖ అధికారులు ఉండరనే ఉద్దేశంతో పలువురు తవ్వకాలు చేపట్టి ఉంటారని భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి రంగురాళ్ల కోసం తవ్వకాలకు కొందరు వ్యక్తులు పాల్పడినట్టు అటవీశాఖ అధికారులకు సమాచారం వెళ్లింది. రెండు రోజుల క్రితం బయట ప్రాంతం నుంచి వచ్చిన రంగురాళ్ల వ్యాపారులు స్థానిక లాడ్జిలో దిగినట్టు ... మిగతా 8వ పేజీలో

పురావస్తు శాఖ ఆధీనంలో అల్లూరి సమాధి

గంటందొర సమాధి కూడా...

- 13 సంవత్సరాల తరువాత వెలుగులోకి..
- 2012లోనే పురావస్తు, చారిత్రాత్మక చిహ్నాలుగా గెజిట్ నోటిఫికేషన్
- ఉమ్మడి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చందనఖాన్ ఉత్తర్వులు
- అప్పట్లో విశాఖపట్నం కలెక్టర్‌కు జీవో కాపీ..

నర్సీపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులు పురావస్తు శాఖ ఆధీనంలో ఉందన్న సమాచారం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సమాధులు పురావస్తు, చారిత్రాత్మక చిహ్నాలుగా గుర్తించిన విషయం 13 ఏళ్ల తరువాత వెలుగులోకి రావడం శోచనీయం. కేంద్ర, రాష్ట్ర స్థాయి మంత్రులు, ఎంపీలు, కలెక్టర్లు... ఇలా ఎంతో మంది ఉన్నతాధికారులు కృష్ణాదేవిపేటలో ఉన్న అల్లూరి పార్కును సందర్శిస్తున్నారు.. ఎన్నో పర్యాయాలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడతున్నారు. అయితే అల్లూరి, గంటందొర సమాధులు పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నట్టు ఏనాడూ ఎవరూ ప్రకటించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులను రక్షిత స్మారక చిహ్నంగా గుర్తించాలన్న ఉద్దేశంతో 2011 జనవరి 22న జీవో ఎంఎస్-18 విడుదల చేసి, సమాధుల స్థలాన్ని రక్షిత స్మారక చిహ్నంగా ప్రకటించింది. దీనిపై ఏమైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే రెండు నెలల్లోగా తెలియజేయాలని కోరింది. అయితే ఇందుకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు రాలేదు. ఈ నేపథ్యంలో అల్లూరి, గంటందొర సమాధులను పురావస్తు, చారిత్రాత్మక స్మారక చిహ్నాలుగా ప్రకటిస్తూ 2012లో తుది జీవోను అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ చందనఖాన్ విడుదల చేశారు. ఇందులో సర్వే నంబర్ 120/38లో 0.85 ఎకరాలు, 129/బీలో 0.43 సెంట్ల స్థలాన్ని కలిపి మొత్తం 1.28 ఎకరాల విస్తీర్ణంలో సమాధులు ఉన్నట్టు పేర్కొన్నారు. అల్లూరి పార్కు సరిహద్దులను కూడా జీవోలో స్పష్టంగా తెలియజేశారు. అప్పటినుంచి పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. వాస్తవంగా పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ప్రదేశాల సంరక్షణ బాధ్యత ఆ శాఖ అధికారులే చూసుకుంటారు. సదరు ఉత్తర్వుల కాపీని అప్పటి విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు కూడా పంపారు. పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలలో ఎటువంటి అభివృద్ధి పనులు జరపాలన్నా ఆ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలి. పురాతన కట్టడాలు, కళాఖండాలు ... మిగతా 8వ పేజీలో



కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులు

నక్కపల్లి ఆస్పత్రికి నూతన హంగులు

రోగులకు త్వరలో అందుబాటులోకి రానున్న మరిన్ని మెరుగైన సేవలు

- సమకూరిన రూ.కోటి విలువైన పరికరాలు
- రోగుల బెడ్‌ల వద్ద ఆక్సిజన్ యూనిట్లు
- ఆర్థోపెడిక్ ఆపరేషన్లకు సీ-ఆర్మ్ మిషన్
- త్వరలో ప్రారంభించనున్న హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



ఆర్థో ఆపరేషన్ల కోసం ఏర్పాటు చేసిన సీ ఆర్మ్ పరికరం



నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి

నక్కపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

నక్కపల్లిలోని 50 పడకల ఆస్పత్రికి వచ్చే రోగులకు త్వరలో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రభుత్వం, కొన్ని సంస్థలు నక్కపల్లి ఆస్పత్రికి అత్యాధునికమైన రూ.కోటి విలువైన వైద్య పరికరాలను సమకూర్చాయి. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత త్వరలో వీటిని ప్రారంభించనున్నారు.



అందుబాటులోకి రానున్న నూతన ఎక్స్‌రే ప్లాంట్

నక్కపల్లి కమ్యూనిటి హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ప్రస్తుతం కాలం చెల్లిన పాత ఎక్స్‌రే మిషన్ ఉంది. ఇది తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి ఆస్పత్రికి ఎక్స్‌రే యూనిట్ అవసరమని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఫలితంగా సుమారు రూ.50 లక్షల విలువైన 300 ఎం.ఎ. సామర్థ్యం గల అధునాతనమైన ఎక్స్‌రే ప్లాంటును ప్రభుత్వం సమకూర్చింది. ప్రస్తుతం ఈ పరికరం ఇక్కడి ఆస్పత్రికి చేరుకుంది. ఈ పరికరాన్ని పూర్తి స్థాయిలో అమర్చేందుకు హైదరాబాద్ నుంచి టెక్నికల్ టీమ్ ... మిగతా 8వ పేజీలో

నమ్మించి నట్టేట ముంచేశాడు

అధిక వడ్డీ ఆశ చూపి రూ.15 కోట్లతో పరారీ

- లబోదిబోమంటున్న బాధితులు
- హోం శాఖ మంత్రి అనిత ఆదుకోవాలని వేడుకోలు



ప్రామిసరీ నోట్లను చూపుతున్న బాధితులు

పాయకరావుపేట రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధిక వడ్డీల పేరుతో అందరినీ నమ్మించి సుమారు రూ.15 కోట్ల వరకు అప్పులు చేసి పరారవ్వడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు శనివారం బాధితులైన కలిగట్ల శ్రీనివాసరావు, వర్మరాజు, పలువురు మహిళలు శనివారం సత్యవరంలో విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. సత్యవరానికి చెందిన పెదిరెడ్డి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి గత పాతికేళ్లలో ముందుగా ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం చేసేవాడని తెలిపారు. ఆ తరువాత కొన్నాళ్లపాటు కాకినాడ జిల్లా తునిలో వస్త్ర నడిపి మూసేశాడని, అనంతరం బంగారం షాపు పెట్టాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో సత్యవరంతో పాటు పరిసర గ్రామాలైన పెదరాంభద్రపురం, మాసాహెబ్‌పేట, పాల్తేరు, అన్నవరం, బొద్దవరం, తదితర ప్రాంతాల్లోని ప్రజలందరితో మంచిగా ఉంటూ వచ్చాడు. తనకు అత్యవసరమంటూ ఆయా గ్రామాలకు చెందిన సుమారు 200 మంది వద్ద నుంచి ... మిగతా 8వ పేజీలో

యర్రవరంలో గ్రావెల్ దందా



మట్టి తరలిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్, జూలై 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరం కొండ వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఈ దందాకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. యర్రవరం దాటిన తరువాత ఉన్న ఈ కొండవద్దకు మట్టి రహదారి ఉంది. దీంతో ట్రాక్టర్లు, జేసీబీ, ట్రాక్టర్లతో వెళ్లి పట్టపగలే ఈ గ్రావెల్‌ను తవ్వకాలు జరుగుతున్నారు. అధికార పార్టీ బలం ఉండటంతో గ్రామ పరిపాలన అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నారు. దీంతో ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్‌ను సుమారు రూ. 1200 చొప్పున విక్రయిస్తూ రూ. లక్షల్లో దోచుకుంటున్నారు. ఆ గ్రామ నాయకునిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా



మృతుడు కన్నారావు భార్యకు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న నేతలు

మునగపాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ క్రియాశీలక సభ్యుడు మాడా కన్నారావు కుటుంబానికి శనివారం యలమంచిలి టీడీపీ కార్యాలయంలో రూ.5 లక్షల బీమా నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, నాయకుడు కర్రి సాయికృష్ణ, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, దాడి శివ తదితరులుపాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

రాంబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి పంచాయతీ అప్పన్నపాలెం కాలనీ గ్లోరియా ఇ ఇమ్మానియేల్ చర్చి ఆవరణలో నిత్యానందం చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో అచ్యుతాపురానికి చెందిన మోరి ఇ హోమియో ఆసుపత్రి యాజమాన్యం శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు ప్రారంభించారు. హోమియో వైద్యులు మోరి సుమారు 200 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చర్చి సభ్యులు రోగులకు సదుపాయాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్లోరియా ఇమ్మానియేల్ చర్చి పాస్టర్ ఎం. సుధీర్‌కుమార్, చర్చి పెద్దలు గొర్లి అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు లాలం సునీత, తదితరులు పాల్గొన్నారు.

గో సంస్కృతిని ప్రోత్సహించాలి

» క్షేత్ర గో సేవా సంయోజక్ ఆకుతోట రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుతోట రామారావు

పాయకరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గో ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని క్షేత్ర గోసేవా సంయోజక్ ఆకుతోట రామారావు అన్నారు. శనివారం స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల డిపార్టుమెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో గో ఆధారిత ఉత్పత్తులపై రెండు రోజుల వర్కుషాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకుతోట రామారావు మాట్లాడుతూ గోవు సనాతన సంస్కృతిలో పవిత్రమైనదని, అది మానవుల జీవనశైలికి పునాదిగా నిలిచిందన్నారు. గో ఆధారిత ఉత్పత్తులు ఉపయోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని ఆయన అన్నారు. అనంతరం పంచగవ్య ఉత్పత్తులు, జీవామృత పద్ధతిలో వ్యవసాయం చేయడంపై అవగాహన కల్పించారు. వర్కుషాప్‌లో భాగంగా మొదటిరోజు దంతమంజన్, ధూప బత్తి, ప్రమిదలు, పేస్ ప్యాక్, హెయిర్ ఆయిల్, షాంపూ, సబ్బులు, దోమల నివారణ మందు తదితర 20 రకాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రాంత గోసేవ సంయోజక్ సభ్యులు, స్పేసెస్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై జడ్పీ సీఈవో ఆరా



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి

పాయకరావుపేట రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): గ్రామంలో చెత్తను ఎప్పటికప్పుడు సంపద తయారీ కేంద్రానికి తరలించాలని జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి అధికారులను ఆదేశించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో మంగవరం కనిష్ఠ స్థాయిలో ఉండడంతో శనివారం ఆయన గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ తిరిగా పారిశుధ్య పనులు, కార్మికులు పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాగునీటి ట్యాంకును సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. కేంద్రంలో తయారు చేసిన వర్మీ కంపోస్టును రైతులు కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు యానాద్రి అమ్మవారి మహోత్సవం



ఏఎస్ఆర్ కాలనీలో పూజలందుకుంటున్న అమ్మవారు

ఎలమంచిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో ఆదివారం శ్రీ యానాద్రి అమ్మవారి జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాలనీ ప్రధాన వీధి సమీపంలోని ఆలయంలో తెల్లవారునుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నారు. అమ్మవారి దర్శనానికి పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర నేపథ్యంలో ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అందరికీ ఇళ్లు.. ప్రభుత్వ లక్ష్యం

» హోం మంత్రి వంగలపూడి అనిత



అమలాపురంలో పర్యటిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం త్వరలో 3 సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి అందజేయనున్నట్టు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని అమలాపురంలో శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.1000 పెన్షన్ పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని, కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఒక్కసారే రూ.1000 పెన్షన్ పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్ పెంపు, రెండు గ్యాస్ సిలెండర్లు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం తదితర పథకాలు అమలుచేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. కారిడార్ కోసం భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తామని, ఎవరూ అపోహలు పడవద్దని స్పష్టంచేశా రు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

ఎలా ఉన్నావ్ తాతా...



అనితకు ఘనస్వాగతం

అమలాపురంలో పర్యటించిన హోం మంత్రి అనితకు శనివారం ఉదయం గ్రామస్థులు, కూటమి నాయకులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఆమె నిర్వహించిన ముఖా-ముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను పరామర్శించి, వారికి సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు గ్రామంలో వున్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం ముగించుకుని వస్తున్న సమయంలో ఓ బాలికకు విద్యుత్‌షాక్ తగలింది. స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మండల పార్టీ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, సర్పంచ్ పెదపూడి శంకరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, కూటమి నాయకులు వైబోయిన రమణ, ఎరుపిల్లి సత్తిబాబు, వై.అప్పలరాజు, గంటా నరసింగరావు, గోపీ, రాజు, కల్యాణ్, బాబ్జీ, శ్రీను, ప్రసాద్, నానాజీ, సత్యం, జోగులు పాల్గొన్నారు.



సముద్రతీరానికి వెళ్ళే రోడ్డు పక్కన చెత్తనిల్వ



వ్యర్థాలతో నిండిన ప్రధాన మురుగునీటి కాలువ

వాడనర్సాపురంలో అధ్వానంగా పారిశుధ్యం

» వీధుల్లో చెత్త కుప్పలు.... కంపుకొడుతున్న కాలువలు

» వ్యాధుల భయం.. పట్టించుకోని పంచాయతీ

రాంబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో చెత్త పేరుకుపోయి, కాలువల్లో మురుగునీటితో పారిశుధ్యం అధ్వానంగా మారింది. సుమారు 5వేలకు పైగా జనాభా కలిగిఉన్న ఈ గ్రామంలో పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ఏఓబీ ఏర్పాటు కావడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన అనేకమంది గ్రామంలో నివాసముంటున్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్డు పక్కన, కాలువల్లో వేసేస్తున్నారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. గ్రామం మధ్యలో రోడ్డును ఆనుకుని ఉన్న కాలువ మురుగు నీటితో నిలిచిపోయింది. దోమలు వృద్ధికి కేంద్రంగా మారింది. ఫలితంగా వ్యాధుల బారిన గ్రామస్థులు వాపోతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు గ్రామ పర్యటనకు వచ్చిన సమయాల్లో, పండగలు జరిగిన ప్పుడు పంచాయతీ అధికారులు తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపడుతుంటారని, తర్వాత నిర్లక్ష్యం వహిస్తున్నట్టు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోకి, సీసీరోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తున్నట్టు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆవసోమవరం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

» ఎమ్మెల్యే విజయ్‌కుమార్ » బైక్‌పై గ్రామ సందర్శన



ఆవసోమవారంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, జూలై 12, (ఆంధ్రజ్యోతి): ఆవసోమవరం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని గ్రామాన్ని శనివారం తెల్లవారుజామున ఆయన బైక్‌పై సందర్శించారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా, అధికారుల ప్రమేయం లేకుండా వెళ్లి గ్రామంలో పర్యటించారు. ప్రజల అవసరాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవసరాలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కార దిశగా పని చేస్తానని ఈ సందరంగా హామీ ఇచ్చారు. సానికాలువ జంక్షన్ నుం చి మడుతూరు గ్రామాన్ని కలిపే రహదారిని పరిశీలించారు. సెజ్‌కు వెళ్లడానికి వీలుగా ఈ రోడ్డును అభివృద్ధి చేస్తానని అన్నారు. గాజువాక నుంచి వచ్చే వాహనాలను సానికాలువ నుండి మళ్లించడం ద్వారా అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్‌కుమార్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్, మాజీ ఎంపీపీ ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో సుపరిపాలన ..

మునగపాక: ప్రజాస్వామ్యబద్ధంగా కూటమి పాలన కొనసాగుతోందని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తెలిపారు. మండలంలో నరేంద్రపురంలో శనివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇంట్లో చదుకునే పిల్లలందరికి తల్లికి వందనం పథకం వర్తింపజేసినట్టు చెప్పారు. వైసీపీ పాలనలో తీవ్రంగా నష్టపోయిన రా ష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు శ్రమిస్తున్నారన్నారు. ఈ



నరేంద్రపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఏడాది పాలన విజయవంతం: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

ఎలమంచిలి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తోందని టీడీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు అన్నారు. శనివారం మండలంలోని తురంగలపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఏడాది ఓమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుప్తా, దాడి లోకేశ్, బాబూరావు, భూపతి, కరణం ప్రకాశరావులు పాల్గొన్నారు.



తురంగల పాలెంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగులో జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌బాబు, నాయకులు

'మాకు స్మార్ట్ మీటర్లు వద్దు'



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఎస్.రాయవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగుమ్ములూరులో స్మార్ట్ మీటర్లు వద్దని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమం చేపట్టి, పేదలపై ఆర్థిక భారం వేస్తోందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ఎస్సీలు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కోల్పోతారని అన్నారు. ప్రభుత్వం విద్యుత్ స్లాబ్ రేట్లు పెంచడంతో తల్లికి వందనం పథకానికి అర్హులైనవారిని అనర్హులుగా చేశారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం మానుకోవాలని అన్నారు.

ధర్మశ్రీని కలిసిన వైసీపీ యూత్ నాయకులు



ధర్మశ్రీతో యలమంచిలి నాయకులు

అచ్యుతాపురం రూరల్, జూలై 12, (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన వైసీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీని నియోజకవర్గ యూత్ నాయకులు శనివారం ఆయన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. యూత్ కమిటీ అధ్యక్షుడు సియాద్రి బుజ్జీ, మండల యూత్ అధ్యక్షుడు గంగూలీ శ్రీను, మునగపాక అధ్యక్షుడు బొడ్డేడ లిల్లీ, యూత్ నాయకులు బండారు రమణ, నడిపింటి శేఖర్ తదితరులు ధర్మశ్రీని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, నియోజకవర్గ పరిస్థితులను వివరించారు.

పాడి రైతులకు సబ్సిడీపై హరియాణా గేదెలు

మునగపాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ పాడి రైతులకు త్వరలో సబ్సిడీపైఐ హర్యానాకు చెందిన గేదెలను అందజేయనున్నట్టుఅనకాపల్లి యూనిట్ మేనేజర్ శరగడం రమణ తెలిపారు. మండల కేంద్రంలో మూడు సొసైటీల పరిధిలోని రైతులకు శనివారం దాణా బేసిన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ రైతుల బాగోగులను విశాఖ డెయిరీ చూసుకుంటుందన్నారు. కుటుంబాలకు విద్య, వైద్య సదుపాయంఅందజేస్తున్నట్టు తెలిపారు. డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, పి.ఎస్. పెంటకోట సత్యనారాయణ, డైరెక్టర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.



మునగపాకలో విశాఖ డెయిరీ రైతులకు బేసిన్లు అందజేస్తున్న మేనేజర్

ఇలా అయితే ప్రమాదాలు జరగవా?



అచ్యుతాపురంలో బారీ లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్

అచ్యుతాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో వాహన యజమానులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి బరువులను తీసుకువెళ్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సెజ్‌లో కర్మాగారాలకు యంత్రాలు, ముడి సరకులు తీసుకువెళ్లే భారీ వాహనాలనుంచి తేలికపాటి వ్యానుల వరకు అత్యధిక బరువులతో తీసుకువెళ్తున్నారు. శనివారం ఓ మినీ వ్యాన్‌లో పరిమితికి మించిన ఎత్తున సరకులు తీసువెళ్తున్న దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కి చిక్కింది. ఇలా వెళ్తే ప్రమాదాలు ప్రమాదాలు చోటుకుంటాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ముగిసిన 24 గంటల దీక్ష



మునగపాకలో దీక్షలో పాల్గొన్న వారికి విరమణకు నిమ్మరసం ఇస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు

మునగపాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, టీడీఆర్ బాండ్లకు బదులు నగదు చెల్లించాలన్న డిమాండ్లతో సీపీఎం చేపట్టిన 24 గంటలు దీక్ష శనివారం ముగిసింది. స్థానిక సహకార సంఘం సమీపంలో శుక్రవారం ఈ దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. రాత్రి ఈ శిబిరంలోనే నిద్రించిన సీపీఎం నాయకులకు శనివారం ఆ పార్టీకి చెందిన జిల్లా నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఇకనైనా నిర్వాసితుల సమస్యలపై స్పందించాలని ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మజీ, కాండ్రేగుల రామసదాశివరావు, బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

15న మెగా జాబ్‌మేళా

నక్కపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15న హోం మంత్రి అనిత సారథ్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. శనివారం హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో పదోతరగతి ఆపైన చదువుకున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 13 ప్రముఖ కంపెనీల ప్రతినిధలు ఈ జాబ్‌మేళాకు హాజరవుతారని చెప్పారు. అభ్యర్థులకు విద్యార్హతను బట్టి స్పాట్‌లోనే నియామక పత్రాలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం



నూకరాజుకు నగదు అందిస్తున్న సాటి కూలీలు

నక్కపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందనాడ గ్రామానికి చెందిన దార నూకరాజు అనే వ్యక్తి రెండు నెలల క్రితం కొబ్బరిచెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్దే ఉంటున్న నూకరాజును తోటి ఉపాధి హామీ కూలీలు శనివారంపరామర్శించారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి రూ. 15వేలు నగదు, 50 కేజీల బియ్యం బస్తా అందజేశారు.

నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ చేపట్టాలి



మూలపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

మునగపాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులపై చేపడుతున్న సామాజిక తనిఖీల ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సర్పంచ్ భీశెట్టి గంగఅప్పలనాయుడు తెలిపారు. మండలంలో మూలపేటలో శనివారం సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఉపాధి పథకం ద్వారా జరిగిన పనులను పరిశీలించి నివేదికను నిజాయితీగా నమోదు చేయాలన్నారు. దీని వల్ల అవకతవలను గుర్తించవచ్చునని ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర, కూటమి నాయకులు ఆడారి ఆనందసన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, ఆడారి జనార్దనరావు, భీశెట్టి నాగేశ్వరరావు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారికి చక్రస్నానం



ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేం కటేశ్వర ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబు ఆధ్వర్యంలో నిత్యహోమం, చూర్ణోత్సవం, బలిహరణ, వసంతోత్సవం జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులకు చక్రస్నానం నిర్వహించి, పూర్ణాహుతి హోమాన్ని జరిపారు. 108 అష్టోత్తర కలశాలతో అభిషేకాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం : డీఎం హెచ్‌వో



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

తుమ్మపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎం హెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి సూచించారు. తుమ్మపాల పీహెచ్‌సీని శనివారం ఆమె తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై రోగులకు అందించే సేవల విషయంలో రాజీపడరాదని సూచించారు. డెలివరీల విషయంలో మరింత అప్ర మత్తంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎం.వాణి జగదీశ్వరి, సీహెచ్‌వో డి.శారద, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగా లైఫ్ బృందానికి ప్రజా ప్రతినిధుల సత్కారం



బంద సభ్యుల సత్కారంలో కొణతాల

కొత్తూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లాకు చెందిన బృందం శనివారం పలువురు ప్రజా ప్రతినిధులను కలిశారు. తొలుత నక్కపల్లిలోని టీడీపీ కార్యాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలిశారు. ఈ సందర్భంగా వీరిని ఆమె అభినందించారు. మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అనకాపల్లి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను సదరు బృందం సభ్యులు కలిశారు. వీరిని కొణతాల సత్కరించి, అభినందించారు.

అండర్ బ్రిడ్జి వద్ద ప్రమాదాల నివారణకు వినతి

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన గడ్డర్ల వల్ల ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని వైసీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం రైల్వేస్టేషన్ ఏఎస్ఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. అండర్‌బ్రిడ్జి కింద నుంచి భారీ బండరాళ్ల లారీలు వెళ్లడం, ఆ వెళ్లిన లారీలు గడ్డర్‌లను ఢీకొనడంతో మార్చి 17వ తేదీన పెను ప్రమాదం జరిగిందని వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు రైల్వే అధికారులకు వివరించారు. ఆ తరువాత పటిష్ఠమైన గడ్డర్లు ఏర్పాటు చేసినప్పటికీ అడపాదడపా ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ, గ్రైహూరి రాజు, కేఎం నాయుడు, దాడి నారాయణరావు, బొడ్డేడ శివ, వేగి త్రినాథ పాల్గొన్నారు.

17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం తొలి మహాసభను అంతా విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు కోరారు. శనివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 17వ తేదీన మహాసభ జరగనుందన్నారు. నేటికీ బీసీ వర్గాలు అణగదొక్కబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వర్గాలకు మాత్రమే రాజ్యాధికారాలు వచ్చాయన్నారు. బీసీలు ఉద్యోగ, రాజకీయ పదవుల్లో వెనుకబడి ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. అనంతరం సమావేశానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లాడ అప్పలరాజు, బోయిన భానుమూర్తియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, జిల్లా నాయకులు రంది గణపతి, బండారు అప్పారావు, ఉరికిటి నాగమణి, దాలిబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు భద్రత కల్పించాలి

సబ్బవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని జిల్లా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు చిదంబరస్వామి డిమాండ్ చేశారు. గొటివాడలో శనివారం జరిగిన జిల్లా దస్తావేజు లేఖరుల సమావేశంలో మాట్లాడారు. పేపర్ లెస్ రిజిస్ట్రేషన్ వలన ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని కూటమి నాయకులు ఎన్నికల ముందు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. ఫిజికల్ డాక్యుమెంట్ విధానాన్ని కొనసాగించాలని, డిజిటల్ లాకర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దస్తావేజులను సమర్పించడానికి ఎలక్ట్రానిక్ మార్గాలను ఉపయోగించడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేషు, కార్యదర్శి మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి రామారావు, శేఖ రమంత్రి శ్రీనివాసరావు, వాసు, పాలవెల్లి, జేఎస్ఆర్ మూర్తి, గున్నాజీరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల బకాయిలు చెల్లించకుంటే సమ్మె

కొత్తూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో పారిశుధ్య కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి యేసుదాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుంటే కార్మిక కుటుంబాలు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. పెరిగిన వేతనాలతో సహా బకాయి పడ్డ మూడు నెలల వేతనాలను పదిహేను రోజుల్లో చెల్లించకుంటే విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ జంక్షన్ వద్ద దెబ్బతిన్న రోడ్డు



చిన్నవీధికి వెళ్లే జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి

రోడ్డు విస్తరణపై ఉలుకూ పలుకూ లేదు

- ఎమ్మెల్యేగా 'పీలా' ఉన్న సమయంలో చింతావారి వీధి రోడ్డు విస్తరణ
- 2023 జూలైలో పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు పనులకు జీవీఎంసీ నిర్ణయం
- పలువురు నిర్వాసితులకు టీడీఆర్‌లు ఇవ్వకపోవడంతో ముందుకు సాగని వైనం
- ప్రస్తుతం స్టేషన్ రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నా పట్టణంలోని స్టేషన్ రోడ్డుకు పట్టిన గ్రహణం వీడడం లేదు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తుండడమే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. పీలా గోవింద సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చింతావారి వీధి రోడ్డును విస్తరించి అభివృద్ధి పరిచారు. ఇంకా ఈ రోడ్డులో పలు దుకాణాలు తొలగించాల్సి ఉంది. దీనికి ఆనుకొని ఉన్న పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు ఉన్న 400 మీటర్ల రహదారిని విస్తరించాలని 2023 జూలైలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తలపెట్టారు. వాస్తవంగా ఈరహదారి 20 నుంచి 23 అడుగుల వెడల్పు ఉండేది. దీనిని 60 అడుగులకు విస్తరించాలని అప్పట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు భావించినప్పటికీ నిర్వాసితుల కోరిక మేరకు 50 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. ఈ మేరకు 2023 జూలై 10వ తేదీన పనులు ప్రారంభించారు. ఈ కారణంగా 139 మంది తమ ఆస్తులను కోల్పోవాల్సి వచ్చింది. వీరికి జీవీఎంసీ ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్‌లు) ఇచ్చింది. అయితే వీరిలో కేవలం 80 మందికి మాత్రమే టీడీఆర్‌లు లభించాయి. మరో 56 మందికి అందాల్సి ఉంది. మిగిలిన ముగ్గురు విస్తరణ వెడల్పు ఐదు అడుగులు తగ్గించాలని కోర్టుకు వెళ్లినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. నాటి నుంచి టీడీఆర్‌లు అదిగో.. ఇదిగో.. అంటున్నారే తప్ప నేటి వరకు నిర్వాసితులకు అందలేదు. ఈ కారణంగా రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు నోచుకోలేదు.



అనకాపల్లి పట్టణంలో విస్తరణకు నోచుకోని స్టేషన్ రోడ్డు

ఇది ప్రధానమైన మార్గం

అనకాపల్లి పట్టణానికి ఇది ఎంతో ప్రధానమైన మార్గం. బంగారం దుకాణాలు, కిరాణా దుకాణాలు, మెడికల్ షాపులు, ఫ్యాన్సీ షాపులు, సినిమాహాల్ ఇటుగానే ఉన్నాయి. అంతేకాకుండా ఈ మార్గం నుంచి పప్పులవీధి, జైన్ మందిరం రోడ్డు, చినరాజుపేట రోడ్డు, చిన్నవీధి, బొగ్గారపువారి వీధి, గొల్లవీధి, కుమ్మరి వీధులకు వెళ్లే ప్రధాన రహదారి. అయితే విస్తరణ ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రహదారి పాడవ్వడంతో అవస్థలు

రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ రహదారి దెబ్బతినడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసే సమయాల్లో చిన్నవీధికి వెళ్లే జంక్షన్, బొగ్గారపువారివీధికి వెళ్లే జంక్షన్, గాంధీబొమ్మ జంక్షన్‌ల్లో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తుంటాయి. ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితుల్లో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు వేగవంతం చేపట్టాలని ఆ ప్రాంతవాసులు, వ్యాపారులు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అలాగే ఆ ప్రాంతవాసులు రెండు రోజుల క్రితం సమావేశమై విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఇదిలావుంటే, ఇప్పటికే గాంధీబొమ్మ జంక్షన్ నుంచి సగం మేరకు డ్రైనేజీ నిర్మాణ పనులను అధికారులు చేపట్టారు. రోడ్డు విస్తరణ పూర్తయితేనే గాని రహదారి నిర్మాణ పనులు చేపట్టే పరిస్థితి లేదు. ఇందు కోసం సుమారు రూ. 80 లక్షల వరకు నిధులు కేటాయించారు. టీడీఆర్‌లు కారణంగా అభివృద్ధి పనులు జరగకపోవడంతో అనకాపల్లి వాసులే కాకుండా మునగపాక, పరవాడ మండలాల నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు కూడా ఇబ్బందులు పడక తప్పడం లేదు. నిర్వాసితులకు పరిహారాలు చెల్లించి రోడ్డును విస్తరించాలని అంతా కోరుతున్నారు.

త్వరలోనే విస్తరణ పనులు

టీడీఆర్‌లు ప్రాసెస్‌లో ఉన్నాయి. అవి అందుబాటులోకి వచ్చిన వెం టనే నిర్వాసితులకు అందజే స్తాం. త్వరలోనే విస్తరణ, అభివృద్ధి పనులు కూడా పూర్తి చేస్తాం. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసు కుంటాం.

- చక్రవర్తి, జడ్సీ, అనకాపల్లి

మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లిలోని జనసేన కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్లకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించేలా రిసోర్స్ పర్సన్లు అంతా కృషిచేయాలన్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి పనుల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారని వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. డ్వాక్రా సంఘాల సభ్యులందరినీ ఈ పథకంలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర,అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఏపీడీవో సంతోష్, 80వ వార్డు డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు, వార్డు జనసేన పార్టీ ఇన్‌చార్జి బుద్ద శ్రీనివాసరావు, జనసేన నాయకులు దూలం గోపీ, మంగా ఈశ్వర్, చేబ్రోలు దుర్గాప్రసాద్, పోలారపు త్రినాథ్, విల్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి వెండి పంచ పాత్రలు బహూకరణ



వెండి పంచపాత్రలు అందజేస్తున్న దాతలు

పరవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ కొండపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి పరవాడ గ్రామానికి చెందిన రెడ్డి వెంకట సత్యన్యాసినాయుడు, నళిని దంపతులు వెండి పంచ పాత్రలను బహూకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావుకు శనివారం వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు హరికృష్ణామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

'కొండుపాలెంలో ప్రభుత్వ భూమిని కాపాడాలి'

తుమ్మపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొండుపాలెం రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు తక్షణమే కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'కొండుపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో సదరు భూమిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ అనకాపల్లి మండలంలో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. భూములను కాపాడాల్సిన అధికారులే ఆక్రమణదారులకు వంత పాడుతుండడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా సమస్యలపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వియ్యపు రాజు, బి.బాబ్జీ, కె.త్రినాథ్, డి.హరీష్, పప్పల ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో అనర్థాలు : డీఎస్పీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ పిలుపునిచ్చారు. ఇక్కడి సీతారామ కళ్యాణ మం డపంలో శనివారం రాత్రి విద్యార్థులకు, డ్రైవర్లకు, ముఠా కార్మికులకు మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, రోడ్డు భద్రత తదితర అంశాలకు సంబంధించి ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల వాడకం వల్ల భవిష్యత్తు అంధకారం కానుందన్నారు. సీఐ జి.రామచంద్రరరావు, ఎస్ఐ పి.సింహాచలం పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయండి

సబ్బవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధి కృషి చేయాలని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ సూచించారు. సబ్బవరం దుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి నూతనంగా నియమితులైన చైర్మన్ గండి దేముడు, సభ్యులు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావును శనివారం తన స్వగ్రామం మొగలిపురంలో సత్కరించి, అభినందించారు. శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు, నాయకులు గండి వంశీదీప్, గండి ముత్యాలనాయుడు, సాయినా ధరావు, దాసరి రమణ, కోరాడ తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ' విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు

సబ్బవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖ విధులను పదే పదే అడ్డుకుంటున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపిన వివరాలివి. మండంలోని అనకపల్లి సర్వే నెంబరు 1లో 257.31 ఎకరాల్లో కొండ విస్తరించి ఉందన్నారు. దీని యాజమాన్య హక్కులు ప్రభుత్వానివేనన్నారు. అయితే అదే సర్వే నంబరులో సుమారు 30 సెంట్ల ఖాళీ స్థలం ఉన్నట్టు చెప్పారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఆక్రమించి అనధికారికంగా బేస్‌మెంట్లు నిర్మిస్తే, తమ సిబ్బంది తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. అయినప్పటికీ మళ్లీ కొందరు వ్యక్తులు సదరు ఖాళీ స్థలంలో బేస్‌మెంట్లు నిర్మించారన్నారు. శుక్రవారం ఎక్సకవేటర్‌తో రెవెన్యూ సిబ్బంది వెళ్లి సుమారు ఆరు సెంట్లలో ఉన్న వాటిని తొలగిస్తుండగా, అదే గ్రామానికి చెందిన కర్రి అప్పారావు కుమారుడు కృష్ణ పదేపదే అడ్డుకుని, విధులకు ఆటంకం కలిగించాడన్నారు. దీనిపై వీఆర్‌వో, ఎంఆర్ఐ ఇచ్చిన నివేదిక ఆధారంగా సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ జి.రామచంద్రరావు కేసు నమోదు చేశారన్నారు.

పైప్‌లైన్ లీకేజీలను త్వరితగతిన అరికట్టాలి

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పైప్‌లైన్ లీకేజీలను త్వరితగతిన అరికట్టి ప్రజలకు తాగునీరందించాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అధికారులను కోరారు. శనివారం సాయంత్రం ఆమె గాంధీనగరంలోని అంజయ్య కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి ఆమె అధికారులతో మాట్లాడుతూ పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట వైసీపీ వార్డు ఇన్‌చార్జి మందపాటి జానకిరామరాజు, కోడూరు రవీంద్ర, ఆకుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ ఫలాలు'



పిళ్లావారివీధిలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పీలా గోవింద

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 84వ వార్డు పిళ్లావారి వీధిలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిళ్లా తారకేసు, తలారి లక్ష్మీప్రసాద్, కొణతాల రత్నకుమారి, సిరసపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మొండిపాలెంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు : పీలా

కొత్తూరు : మొండిపాలెంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద అన్నారు. శనివారం అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ కొండుపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించి మాట్లాడారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ సహకారంతో మొండిపాలెం గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ యువ నాయకుడు పీలా శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ నాయకులు చందక నర్సింగరావు, మహాలక్ష్మినాయుడు, దొడ్డి సూరిబాబు, పల్లా అబ్బాయినాయుడు, మరపురెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెదముషిడివాడలో పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

పెదముషిడివాడ, కన్నూరు గ్రామాల్లో...

పరవాడ/ లంకెలపాలెం : కూటమి పాలనలో సూపర్‌సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో పెదముషిడివాడ, కన్నూరు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి సమ్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మానవరపు అప్పలనాయుడు, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, పార్టీ నాయకులు గండి వంశీ, చింతకాయల ముత్యాలు, కన్నూరు వెంకటరమణ, బంధం వెంకటరమణ, కోమటి వెంకటరమణ, మడక రాజునాయుడు, గంట్ల ఈశ్వరరావు, ఆర్నీ అప్పారావు, పైలా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు జాఫ్రా మొక్కలు పంపిణీ


సీలేరు నర్సరీ వద్ద మొక్కలు అందిస్తున్న అటవీ శాఖ అధికారులు

సీలేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు అటవీశాఖ రేంజ్ పరిధిలో నర్సరీల్లో అటవీశాఖ పెంచిన జాఫ్రా మొక్కలను గిరిజన రైతులకు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. సీలేరు సెక్షన్ పరిధిలో జాతీయ ఉపాధి హామీ నర్సరీలో 40 వేలు, ధారకొండ సెక్షన్ పరిధిలో నర్సరీలో 40 వేల జాఫ్రా మొక్కలను పెంచినట్టు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్. వెంకటరావు తెలిపారు. వీటిని ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల పరిధిలోని ధారకొండ, గంగవరం, కొంగపాకలు, టోకరాయి, కొల్తూరుకోట, దబ్బలంక, నేరేడుపల్లి, బూసుకొండ, వలగెడ్డ, చింతపల్లిక్యాంప్, లకున్‌పూర్, పిల్లిగెడ్డ గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు అందజేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ అధికారి కె. సతీశ్, అటవీశాఖ బీట్ ఆఫీసర్ కె .లోవరాజు, రాకేష్, ధారకొండ సర్పంచ్ ఎస్. రాజు, ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న తదితరులు పాల్గొన్నారు.

'స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు సహించం'


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

పాడేరురూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశ, మిడ్డే మీల్ నిర్వాహకులు, వీవోలు తదితర చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడితే సహించేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. సీఐటీయూ కార్యాలయంలో ఆయన శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాలంలో స్కీమ్ వర్కర్లయిన అంగన్‌వాడీలు, ఆశలు, వెలుగు వీవోఏలపై గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకులనుంచి వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీలు ఫీడింగ్ సక్రమంగా ఇవ్వడం లేదని, ఆశ కార్యకర్తలు విధులకు సక్రమంగా రావడం లేదని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మెనూ అమలు చేయడం లేదంటూ ఇలా అనేక రకాలుగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.ఏళ్ల తరబడి అవే వృత్తిని నమ్ముకొని చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న వీరిపై రాజకీయ నాయకులు వేధింపులకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు స్పందించి నాయకులు వేధింపులు ఆపకుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్.సుందరరావు, సత్యనారాయణ, జీనబంధు, శంకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో విఫలం: సీపీఐ

పాడేరురూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలో ప్రభుత్వ భూముల పరిరక్షించడంలో అధికారులు అలసత్వం వహించడం తగదని సీపీఐ జిల్లా నాయకుడు జల్లి రాజబాబు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా మారి, అభివృద్ధి చెందుతున్న తరుణంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. పాడేరు గొందూరునుంచి చింతలవీధి పంచాయతీ కేంద్రంవరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు లోనయ్యాయన్నారు. ఐటీడీఏ రేకులకాలనీ, గుడివాడ, లోచలిపుట్టు, తలారిసింగి, సుంద్రుపుట్టు, కుమ్మరిపుట్టు, సిల్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వానికి సంబంధించిన భూములు 90 శాతం వరకు కబ్జాదారుల చేతుల్లోకి మరాయన్నారు. అయినా, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు అమలుకు నోచుకోవడంలేదన్నారు. మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు పిర్యాదు అందితే తాత్కాలికంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఐటీడీఏ కార్యాలయం వెనకనే ఉన్న ఐటీడీఏ క్వార్టర్‌లో ఆక్రమణదారులు భారీ గృహ నిర్మాణాలు చేపట్టి, వాటిని యధేశ్చగా అమ్మకాలు చేపడుతున్నా కలెక్టర్, ఐటీడీఏ పీవోలు స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇకనైనా కలెక్టర్, ఐటీడీఏ పీవోలు స్పందించి ఆ క్రమణలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

హుకుంపేట జూలై 12 ఆంధ్రజ్యోతి: మండలంలోని మఠం పంచాయతీ గన్నేరుపుట్టు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. ముందుగా సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి వీరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. రూ. 4230 స్వాధనం చేసుకున్నట్టు చెప్పారు.

చింతపల్లి వ్యవసాయ అధికారిగా మధుసూదనరావు



చింతపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా మధుసూదనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తాజా బదిలీల్లో మూడేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన బి. శ్రీనివాసరావుని శ్రీకాకుళం రేగడి ఆమదాలవలసకు బదిలీకాగా ఆయన స్థానంలో జీకేవీధిలో పనిచేస్తున్న మధుసూదనరావు ఇక్కడ నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. సాగులో అధునాతన మెలకులను అందజేసి అధిక దిగుబడులు సాధించేలా సిబ్బందితో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు.



అమ్మకాలకు నోచుకోక కాకరపాడు కలప డిపోలో మట్టిపాలవుతున్న మారుజాతి కలప దుంగలు

రూ. కోట్ల ఖరీదు చేసే కలప మట్టి పాలు

- రెండున్నరేళ్లుగా కాకరపాడు డిపోలో నిల్వ
- ధర వ్యత్యాసంతో కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- రూ. 2 కోట్ల మారుజాతి కలపకు చెదలు

కొయ్యూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) అటవీశాఖకు కోటి రూపాయల మేర ఆదాయం సమకూరే కలప నిర్వీర్యమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేయడానికి కలప డిపోల వ్యాపారులు ముందుకు రాక పోవటంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో గత రెండున్నరేళ్ళుగా కాకరపాడు కలప డిపోలో నిల్వ చేసిన మారుజాతి కలప వృథాగా మట్టిలో కలిసిపోతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణాలలో భాగంగా చింతాలమ్మ ఘాట్, రొంపుల ఘాట్‌లలో రోడ్డు విస్తరణ చర్యల్లో భాగంగా అటవీ భూభాగంలో వేసిన అలైన్‌మెంట్ ప్రాప్తికి తొలగించిన అటవీశాఖ మారుజాతి కలపగా పరిగణించే గుంపెన, తంగేడు, పచారీ, బెన్నంగి, సిరిమాను (తెల్ల కర్ర), గన్నర, బండారు తదితర సుమారు 700 సీఎంటీను 2023 జూన్ నుంచి నవంబరు వరకు కాకరపాడు (చీడిపాలెం కూడలి దరి ఐటీడీఏ కాలనీ ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన) అటవీ కలప డిపోకు తరలించి జాతుల వారీగా నిల్వ చేశారు. ఈ కలప అడుగు రూ. 500 నుంచి రూ. 550 మధ్యలో ధర నిరయించి ఇప్పటి వరకు సుమారుగా 25 సార్లు వేలం పాటలు నిర్వహించారు. అయితే, అటవీశాఖ నిర్దేశించిన అడుగు కలప ధరకువ్యాపారులు కొనుగోలుకు ముందుకు రాలేదు. సుమారు రూ. 200 మేర వ్యత్యాసం ఉండటంతో అధికారులు మిన్నకుండిపోయారు. దీంతో సుమారు రూ.కోటి మేర అటవీశాఖకు ఆదాయం సమకూరే కలప ధరలో రెండున్నరేళ్లుగా డిపోలో నిల్వ ఉండిపోయింది. దీంతో కలప నేలపై జాతుల వారీగా గుట్టలు వేసి ఉంచటంతో వర్షాలకు, ఎండకు కలప పాడై మట్టిలో కలసిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో ఈ కలపను అడుగు రూ. 300 నుంచి రూ. 400 మధ్యలో అయితే వేలంలో పాల్గొనేందుకు వ్యాపారులు సిద్ధపడుతున్న విషయాన్ని చింతపల్లి డీఎఫ్‌వో అటవీశాఖ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి లేఖల ద్వారా తెలిపారు. అయితే. ధర తగ్గించే విషయంలో ఏ విధమైన అనుమతులు జారీ కాకపోవడంతో రూ. కోటి విలువ చేసే కలప మట్టిపాలవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ కలప విక్రయాలపై పునారోలోచన చేసి, తిరిగి వేలంపాటలు నిర్వహించేలా స్థానిక అటవీశాఖ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

'ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి'


తొర్తుంపాడులో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, ఉపాధి కూలీలు

చింతపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ తోర్తుంపాడు గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే నిధులు విడుదల కావాల్సి ఉందని, వచ్చిన వెంటనే విడుదల చేస్తామని సమాధానం ఇస్తున్నారన్నారు. నెలల తరబడి వేతనాలు అందక కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మజ్జి రాంబాబు, ఉపాధి కూలీల సంఘం నాయకులు కొర్ర రాజేంద్ర, సన్యాసిరావు, భాస్కరరావు, కొర్ర సూరిబాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

హుకుంపేటలో ట్రాఫిక్ జాం


ప్రధాన రహదారిలో నిలిచిన వాహనాలు

హుకుంపేట జూలై 12 ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా శనివారం వాహనలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. వాహనచోదకులు, ఇతర ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఇంతగా ట్రాఫిక్ సమస్య నెలకొన్నా పోలీసులు వచ్చి నియంత్రించే చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు తలెత్తాయి. ప్రతి శనివారం సంత జరుగుతుంది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇకనైనా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటక ప్రదేశాల్లో సందడి


చాపరాయి వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన చాపరాయి జలవిహారీ, అంజోడ సిల్క్ ఫాంలో శనివారం సెలవు రోజు కావడంతో మైదాన ప్రాతం నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. జలవిహారిలో అందాలను తిలకిస్తూ స్నానాలు చేశారు. సంప్రదాయ ధింసా నృత్యాల కళాకారులతో కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. తిరుగు ప్రయాణంలో అరకు అంజోడ సిల్క్ ఫాంలో ఎత్తైన పైనరీ చెట్ల మధ్య ఫోన్లతో సెల్ఫీలు తీసుకున్నారు. పచ్చని చెట్లు, చల్లని వాతావరణంలో భోజనాలు చేస్తు చిన్నారులతో ఆనందంగా గడిపారు.

'సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి'



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకట రమణ

చింతపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలేపల్లి వెంకట రమణ అన్నారు. శనివారం స్థానిక గిరిజన భవన్‌లో మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన పార్టీ మండల మహాసభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గిరిజన ప్రాంతం సీపీఐకి కంచుకోట అన్నారు. కాలం క్రమంగా పార్టీ కొంత బలహీన పడిందన్నారు. ఈ స్థితిలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలు సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీపీఐ చింతపల్లి మండల కార్యదరిగా రెండోసారి పేట్ల పోతురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభకు హాజరైన కార్యకర్తలు నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. మండల కార్యదర్శితో పాటూ సహాయక కార్యదర్శులుగా పొత్తూరు చిన్నారావు, సెగ్గె సత్తిబాబు, కార్యదర్శి వర్గ సభ్యులుగా షేక్ రహిమాన్, గంజారి రమణ, గెమ్మెలి కుజ్జన్న, బాలన్న, సీందేరి రాంబాబు, గొల్లోరి కామేశ్వరరావులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

లీకేజీతో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

- నిర్మాణ సమయంలో నాణ్యతా లోపంతోనే ఈ దుస్థితి

కొయ్యూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బట్టపణుకుల పంచాయతీ తీగలమెట్ట గ్రామంలో ఐదేళ్ల క్రితం నిర్మించిన తాగునీటి పథకం లీకవుతుండటంతో నీరు వృథాగా పోవటమే కాకుండా ట్యాంకు శిథిలావస్థకు చేరుతోంది. అప్పట్లో నాణ్యతా లోపంతో నిర్మాణం చేపట్టడంతోనే ఈ దుస్థితి నెలకొంది స్థానికులు ఆరోపిస్తున్నారు.నీరు మొత్తం ట్యాంకు కింద నిలువ ఉండటంతో భూమిలో ఇంకి పిల్లర్లు కుంగిపోయే ప్రమాదం నెలకొంది. ట్యాంక్ ఈ స్థితిలో ఉన్నా పట్టించుకోకపోవడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో భయపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇకనైనా సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థుడు రంజిత్‌కుమార్ తదితరులు కోరుతున్నారు.


తీగెలమెట్టలో శిథిల స్థితికి చేరిన వాటర్ ట్యాంకు


లీకవుతున్న నీటితో కిందన నాచుకట్టిన దృశ్యం

'వ్యవసాయ ఆర్గానిక్ పాలిటెక్నికల్ కళాశాల ఎత్తివేత సరికాదు'

గూడెంకొత్తవీధి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చింతపల్లిలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను తక్షణమే పునరుద్ధరించాలని గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ముర్ల వెంకట రమణ, గెమ్మెలి మోహన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఎత్తివేత ఉత్తర్వుల అనంతరం పరిశోధన స్థానాన్ని సందర్శించి శాస్త్రవేత్తలతో మాట్లాడినట్టు చెప్పారు. 14ఏళ్లగా విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందించిన కళాశాలను ఈ ఏడాది ప్రవేశాలను రద్దుచేసినట్టు శాస్త్రవేత్తలు తెలియజేశారన్నారు. ప్రత్యేక చరిత్ర కలిగిన చింతపల్లి ప్రాంతానికి చెందిన ప్రభుత్వ విద్యాసంస్థను విద్యార్థులకు దూరం చేయడం బాధాకరమన్నారు. కళాశాలను ప్రభుత్వ పెద్దలు తక్షణమే పునరుద్ధరించకుంటే అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి ఉద్యమిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.


గూడెంకొత్తవీధిలో మాట్లాడుతున్న గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు


మాట్లాడుతున్న చింతపల్లి ఎంపీపీ అనుషదేవి, ఎంపీటీసీ సభ్యులు

కళాశాలను కొనసాగించాలి: ఎంపీపీ

చింతపల్లి: స్థానికఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను యథావిధిగా కొనసాగించాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి కోరారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పాలిటెక్నిక్ కళాశాలను మూసివేస్తున్నట్టు జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కళాశాలలో 14ఏళ్లగా ఎంతో మంది విద్యార్థులు వ్యవసాయ విద్యను అభ్యసించారన్నారు. రాష్ట్రంలో ఏకైక ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాల చింతపల్లిలో మాత్రమే ఉన్నదన్నారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా కళాశాలను పునరుద్ధరించాలని కోరుతూ వ్యవసాయశాఖా మంత్రికి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులంతా కలిసి లేఖరాస్తున్నామన్నారు.ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి పద్మ, రూతు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయ విద్య దూరం మాజీ మంత్రి బాలరాజు

సీలేరు: చింతపల్లి వ్యవసాయ ఆర్గానిక్ పాలిటెక్నికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంనుంచి ప్రవేశాలు నిలిపివేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసహరించుకోవాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్టు చెబుతూ మరోవైపు అందుకు సంబంధించిన విద్యా సంస్థలను మూసివేయడం దారుణమని పేర్కొన్నారు. ఈ స్థితిలో వెంటనే కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించాలని ఆయన కోరారు. కేవలం ఈ కళాశాలలో 25 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఈ సీట్లను పెంచాల్సిందిపోయి పూర్తిగా తొలగించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

కూటమి పాలనతోనే ప్రజలకు మేలు

- ఏపీ టూరిజం డైరెక్టర్ రమేశ్‌నాయుడు


పాడేరులో సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు రమేశ్‌నాయుడు, మాజీ మంత్రి మణికుమారి, తదితరులు

పాడేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనతోనే ప్రజలకు మేలు చేకూరుతుందని ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌కు సమీపంలోని శనివారం ఓవీధిలో మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారితో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న తరుణంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. అలాగే, ఇప్పటి వరకు అమలుచేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేశ్‌కుమార్, వియ్యపు వెంకట్, హరి, శ్రీను, భూషణ్, కాశీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి యువత దూరంగా ఉండాలి: ఎస్ఐ

ముంచంగిపుట్టు, జులై 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి, సారాకి యువత దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలో శనివారం రాత్రి విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలి మీదుగా జోలాపుట్టు, కుమడ, పెదబయలు, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను, సంతకు వచ్చి వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను, వాహనాల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి సాగు, సారా తయారీ చేసి విక్రయిస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. వాటికి ఎంత దూరంగా ఉంటే భవిష్యత్తు అంత బాగుంటుందని తెలిపారు. మత్తుకు బానిసై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి, సారా నివారణే లక్ష్యంగా పక్కాగా పనిచేస్తున్నట్టు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

కించాయిపుట్టులో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

- సచివాలయంలో మూలకు చేరిన కంప్యూటర్లతో అవస్థలు


సచివాలయంలో పాడైన కంప్యూటర్లు

ముంచంగిపుట్టు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు గ్రామ సచివాలయంలో కంప్యూటర్లు మూలకు చేరడంతో గత వారం రోజులుగా ఆన్‌లైన్ ప నులు సక్రమంగా జరగడంలేదు. దీంతో సుదూర ప్రాంతాలను నుంచి వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వస్తున్న వారు పనులు జరగక తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలో విద్యుత్ హై వోల్టేజీ రావడంతో సచివాలయంలోని రెండు కంప్యూటర్లు, సీపీయూలు, ప్రింటర్ కాలిపోయాయి. దీంతో సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. సుమారు వారం రోజులవుతున్నా, సంబంధిత అధికారులు వీటి మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఆధార్, రేషన్ సవరణ, సర్టిఫికెట్లు తదితర పనులకు పంచాయతీ పరిధిలోని వర్కుగుమ్మి, రాములు, మర్రిపుట్టు తదితర గ్రామాల నుంచి వస్తున్న గిరిజనులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించి నిరాశతో వెనుదిరుగుతున్నారు.ఇకనైనా మండల పరిషత్ అధికారులు స్పందించి కప్యూటర్లు వినియోగంలోకి వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ఆన్‌లైన్ పనుల నిమిత్తం వచ్చి సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

వారపు సంతల్లో వసతులు కల్పించాలి: గిరిజన సంఘం

ముంచంగిపుట్టు, జులై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, బూసిపుట్టు, లక్ష్మీపురం, బంగారుమెట్టలో జరిగే వారపు సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘం జిల్లా నేత కె.త్రినాద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంతల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో చిల్లర వ్యాపారులు, సంతకు వచ్చే క్రయ, వి క్రయదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంతల్లో దుకాణాలు ఏర్పాటుకు రేకు షెడ్లు ఏర్పాటు చేయాలని, షాపుల ఎదుట సీసీ రోడ్లు వేయాలని, తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. మరుగుదొడ్లు నిర్మించాలని అన్నారు. ముంచంగిపుట్టులో శనివారం జరిగే వారపు సంతకు 23 పంచాయతీలతో పాటు ఒడిశా నుంచి అనేక గ్రామాల ప్రజలు వస్తారని, వారంతా కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. షెడ్లు లేక చిన్నపాటి పాకల్లో టార్పాన్లు, కర్రల సహాయంతో నిర్మించిన వాటిలో దుకాణాలు పెట్టాల్సి వస్తుందన్నారు. చిన్నపాటి వర్షం పడినా వ్యాపారులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందన్నారు. ఈ స్థితిలో వసతులు కల్పించాలని, లేకుంటే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

టీడీపీ లైగండ గ్రామ కమిటీ ఏకగ్రీవం


ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

డుంబ్రిగుడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైగండ పంచామతీ కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా టి. సత్యారావు, ఉపాధ్యక్షుడిగా పి. మహదేవ్, ఇతర సభ్యులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో, ట్రాలీ ఢీ: ముగ్గురికి గాయాలు


రచ్చపల్లి మలుపు వద్ద ఢీకొన్న ఆటో, ట్రాలీ

జి.మాడుగుల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల - చింతపల్లి ప్రధాన రహదారికి సింగర్ప పంచాయతీ రచ్చపల్లి మలుపు వద్ద ఆటో, ట్రాలీ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలివి.. సుర్మతి పంచాయతీ మద్దివీధి గ్రామానికి చెందిన గొల్లోరి భానుమతి, భర్త కృష్ణతోపాటు కుమారుడు వినయ్ కుమార్ చింతపల్లి మండలంలో ఓ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో వీరి ముగ్గురికీ గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించడంతో క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయాపడిన భానుమతికి పాడేరు ఆసుపత్రిలో వైద్యం అందించి అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవలకోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

ఉదయం తరగతి.. రాత్రి వసతి!

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలయోగి గురుకుల విద్యాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ కళాశాలలో వసతి గృహం గదులు మరమ్మతులకు గురికావడం.. కిటికీలు, తలుపులు లేకపోవడం.. బెంచీలు విరిగిపోవడం.. బాత్ రూములు, మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉండడం.. వీటన్నిటికీ మించి తరగతి గదుల్లోనే రాత్రి బస చేస్తుండడం.. వెరసి విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు.

- బాలయోగి గురుకులంలో అన్నీ సమస్యలే..!
- తరగతి గదుల్లోనే విద్యార్థుల రాత్రి బస
- మరుగుదొడ్లు లేక ఆరుబయటకు పరుగులు
- విరిగిపోయిన బెంచీలు.. నేలపైనే చదువులు
- నత్తనడకన డార్మెటరీ మరమ్మతు పనులు
- పట్టించుకోని అధికారులు.. విద్యార్థుల అవస్థలు



తరగతి గదిలోనే ఉన్న విద్యార్థుల పెట్టెలు, బక్కెట్లు, దుస్తులు

గొలుగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు 530 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్‌లో తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం 390 మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. ఇక్కడ డార్మెటరీ, బాత్ రూములు, మరుగుదొడ్లు, వసతి గదులకు కిటికీలు, తలుపులు మరమ్మతులకు గురయ్యాయి.

దీంతో విద్యార్థులు వసతి సమస్యను ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేకపోవడంతో తరగతి గదుల్లోనే రాత్రి బస చేస్తున్నారు. ఉదయం ఆవే గదుల్లో తరగతులు నిర్వహిస్తుండగా, రాత్రి వేళ వసతికి వినియోగిస్తున్నారు. అలాగే బాత్ రూములు, మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. తరగతి గదుల్లోని బెంచీలు విరిగిపోవడంతో నేలపైనే కూర్చొని చదువులు సాగిస్తున్నారు.



తరగతి గదిలో నేలపైనే కూర్చొన్న విద్యార్థులు... (ఇన్‌సెట్‌లో) మూలకు చేరిన బెంచీలు

నత్తనడకన డార్మెటరీ మరమ్మతు పనులు

గురుకులంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్యను ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు తీసుకువెళ్లారు. దీంతో పది నెలల క్రితం ఆ శాఖ నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిన సమయంలో డెర్మెటరీ మరమ్మతులు పనులు ప్రారంభించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి, విద్యార్థులు గురుకులానికి వచ్చే సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పనులు పూర్తికాలేదు. మూడు నెలలుగా నత్తనడకన పనులు సాగుతుండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

ఈ సమస్యపై డీఈ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, వేసవి సెలవుల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు. ప్రస్తుతం పనులు సాగుతున్నాయని, వారం రోజుల్లో పూర్తిచేసి అప్పగిస్తామని ఆయన తెలిపారు. అలాగే ప్రిన్సిపాల్ కోటేశ్వరరావును సంప్రదించగా, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆయన తెలిపారు.



కిటికీలు, తలుపులు లేని వసతిగృహం భవనం

తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించండి

రక్షిత నీటి పథకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. శనివారం ఆర్‌డబ్ల్యూస్ ఈఈ ఎ.రామస్వామి, డీఈఈ ఎం.జయరాం, నాలుగు మండలాల ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించి, ఆయా ప్రాంతాల్లో శాస్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వేసవికి రెండు నెలల ముందు ప్రతిపాదనలు చేస్తే నిధులు మంజూరయ్యే సమయానికి కాలాతీతమవుతుందని చెప్పారు. అందువల్ల నీటి పథకాల కోసం ముందుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు.

పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా గిరిజనుల నిరసన



అదానీ ఫొటోలను తగలబెట్టి నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులు వెంటనే రద్దు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదకోట పంచాయతీ రేగులపాలెం వద్ద నాలుగు రోజులుగా వంటావార్పు కార్యక్రమం చేపడుతున్న గిరిజనులు, శనివారం సంప్రదాయ విల్లంబులు చేతపట్టి నిరసన తెలిపారు. అలాగే అదానీ చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న మాట్లాడుతూ పెదకోట ఏరియాలోని రేగులపాలెం, దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ మధ్యలో 900 మెగావాట్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడంతో, రెండు జీవ నదులకు ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పవర్ అనుమతులు రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు గవర కార్పొరేషన్ డైరెక్టర్ల పూజలు



మావుళ్లమ్మ ఆలయంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్లు

చోడవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన భీమవరం మావుళ్లమ్మ దేవస్థానాన్ని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్లు శనివారం సందర్శించారు. కార్పొరేషన్ డైరెక్టర్లు వేగి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగగంగాధర్, మళ్ల రామకృష్ణ, పెంటకోట అజయ్‌బాబు, బొడ్డేటి శ్రీనివాసరావు, బుద్ధ లక్ష్మీనారాయణ, విల్లూరి హరికృష్ణ, భీమరిశెట్టి శ్రీను, ఆళ్ల మంగరాజు, మల్ల గణేశ్, మళ్ల రవికుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈవో కార్పొరేషన్ డైరెక్టర్లను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న డైరెక్టర్ పొలమరశెట్టి నాగేశ్వరరావును వారు పరామర్శించారు.

వీఆర్‌ఆర్ పేటలో జగన్నాథస్వామి పండుగ



గ్రామంలో నీటి కుండలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బుచ్చెయ్యపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేటలో శనివారం జగన్నాథస్వామి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. జగన్నాథస్వామి రథయాత్ర పూర్తయిన రెండో శనివారం ఈ పండుగను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మహిళలు ప్రతీ ఇంటి నుంచి ఖాళీ బిందెలు, కుండలతో గ్రామ శివారు బావిలో నీరు నింపుకుని ఇళ్లకు తెచ్చుకున్నారు. ఇది పూర్వీకుల నుచి వస్తున్న ఆచారమని పెద్దలు తెలిపారు.

ఎట్టకేలకు బస్ స్టేషన్ సీసీ రోడ్డుకు మోక్షం

- రూ.6.5 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభం

కృష్ణాదేవిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం (కృష్ణాదేవిపేట) ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో సీసీ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎంపీ నిధులు రూ.50 లక్షలతో బస్‌స్టేషన్ నిర్మించారు. అప్పటి నుంచి బస్ స్టేషన్ అభివృద్ధికి నోచుకోలేదు. అప్పటిలో బస్ స్టేషన్ ఆవరణలో వేసిన మెటల్ రోడ్డు పలుచోట్ల గోతులు పడి బురదమయంగా మారాయి. అంతేకాకుండా వర్షంనీరు ఎటు పోలేని దుస్థితి ఉండడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆర్టీసీ నిధులు రూ.6.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో శనివారం సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో బస్ స్టేషన్ ఆవరణలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. వాతావరణం అనుకూలిస్తే వారం రోజుల్లో సీసీ రోడ్డు నిర్మించి ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతామని ఆ శాఖ విశాఖపట్నం డీఈఈ నరసింగరావు తెలిపారు. దీంతో గిరిజన, మైదాన ప్రాంతాల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సీసీ రోడ్డు పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

నల్లరాయి క్వారీ నిలిపివేయాలని దళితుల ఆందోళన

మాకవరపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నల్లరాయి క్వారీ పనులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ జి.కోడూరు గ్రామానికి చెందిన దళితులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు శనివారం జి.కోడూరు రెవెన్యూలో ఉన్న నల్లరాయి క్వారీ పనులు ప్రారంభించేందుకు వచ్చిన క్వారీ యాజమానులను అడ్డుకున్నారు. ఈ పనులు చెయ్యవద్దని నిరసన తెలుపుతూ క్వారీ లారీలను అడ్డుకున్నారు. అయితే జి.కోడూరు రెవెన్యూలో సర్వే నెంబరు 332లో 24 హెక్టార్లకు సంబంధించిన నల్లరాయి క్వారీకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఈ క్వారీ పరిసర గ్రామాలకు చెందిన 19 కుటుంబాలకు ప్రభుత్వ డి.పట్టా భూములు ఉన్నాయి. ఏడాది క్రితం భూములలో పంట నష్టపోతుందని క్వారీని నిలిపివేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్వారీ పనులు ప్రారంభించేందుకు యాజమానులు ప్రయత్నించగా, మళ్లీ పనులు వారు అడ్డుకున్నారు. దీంతో సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ దామోదర నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పనులు అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దళితులను హెచ్చరించారు. దీంతో అక్కడ ఉన్న డి.పట్టా సాగుదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చేసేది లేక పనులను నిలిపివేసి వారు వెనుదిరిగారు. అనంతరం దళితులు మాట్లాడుతూ క్వారీ పనులు ప్రారంభిస్తే ఉధృతం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సీఐతో వాగ్వాదం చేస్తున్న భూముల సాగుదారులు

ఎంపీడీవో విజయలక్ష్మికి నివాళులు



ఎంపీడీవో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో వి.విజయలక్ష్మి శనివారం ఘనంగా నివాళులర్పించారు. గత నెల 18న ఎంపీడీవో మృతి చెందిన విషయం తెలిసిందే. విశాఖపట్నంలోని ఇసుక తోటలో ఆమె స్వగృహం వద్ద నిర్వహించిన కార్య క్రమంలో బుచ్చెయ్యపేట మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయాల సిబ్బంది, నాయకులు విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేశారని, ఎవరినీ ఇబ్బంది పెట్టేవారు కాదని ఈ సందర్భగా వారు గుర్తు చేసుకున్నారు.

జోరుగా ప్రభుత్వ భూముల సర్వే

- 350 ఎకరాల్లో సర్కారు భూముల గుర్తింపు

మాకవరపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూముల సర్వే జోరుగా సాగుతోంది. రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో ఎరకన్నపాలెం, రామన్నపాలెం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి గ్రామాలకు అనుకొని సుమారు 1172 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ ప్రాంతంలో కంపెనీల ఏర్పాటుకు చొరవ చూపడంతో ప్రభుత్వ భూములను సర్వే చేయాలంటూ ఆర్డీవో వి.వి.రమణ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారం రోజులుగా ఇక్కడ రైతుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంతవరకూ 350 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. మిగిలినది అటవీ శాఖకు సంబంధించినది అధికారులు చెబుతున్నారు. అయితే సర్వే పూర్తయిన తర్వాత ఎకరాకు రూ.2 లక్షల పరిహారం ఇస్తారంటూ ఇక్కడ ప్రచారం జోరందుకుంది. రైతులు పూర్తిగా సహకరిస్తుండడంతోనే సర్వే వేగంగా సాగుతున్నదని రెవెన్యూ అధికారులు చెప్పారు.



రాచపల్లి సర్వే నంబరు-737లో సర్వే చేస్తున్న అధికారులు

పశు వైద్య కేంద్రం తెరవండి మహాప్రభో..

పాడి రైతుల వేడుకోలు



నాతవరంలో వారం రోజులుగా మూసివేసి ఉన్న పశు వైద్య కేంద్రం

నాతవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం వారం రోజులుగా తెరచుకోవడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి పాడి పశువులను తీసుకుని వస్తున్న రైతులు, పశు వైద్య కేంద్రానికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించి నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీంతో అనారోగ్యంతో ఉన్న పాడి పశువులను వైద్యం అందడం లేదని వారు గగ్గో పెడుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా వారంలో మూడు రోజులు గునుపూడి వైద్యులు ఇక్కడికి వచ్చి కేంద్రాన్ని తెరిచేవారని, ఇప్పుడు గునుపూడి వైద్యుడు మోక్షరెడ్డి కూడా వేరే మండలానికి వెళ్లిపోవడంతో కేంద్రం మూసివేసి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంతో విలువైన తమ పశువులకు సరైన వైద్య సేవలు అందడం లేదని పాడి రైతులు మండిపడుతున్నారు.

ఒకప్పుడు నాతవరం పశువైద్య కేంద్రంలో ఒక డాక్టరు, ఒక వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ ఉండేవారు. ప్రతి రోజూ చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే పశువులకు వారు మెరుగైన వైద్య సేవలు అందించేవారని పాడి రైతులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం పశు వైద్య కేంద్రం మూసివేసి ఉండడం చూసి తమకు తీవ్రమైన వేదన కలుగుతుందని పాడి రైతులు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా పశు సంవర్థక శాఖ అధికారులు స్పందించి నాతవరం పశు వైద్య కేంద్రంలో డాక్టర్‌తో పాటు సిబ్బందిని ఏర్పాటు చేసి పశువులకు సక్రమంగా వైద్య సేవలు అందించేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం: సీఐ



రావణాపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమవుతుందని రూరల్ సీఐ రేవతమ్మ హెచ్చరించారు. మండలంలోని రావణాపల్లి గ్రామస్థులతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. ప్రజలు, పోలీసుల భాగస్వామ్యంతో గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలు నివారించవచ్చునన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఈ బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామారావు, సర్పంచ్ కొల్లి రమణమ్మ, స్థానిక నేత సత్తిబాబు పాల్గొన్నారు.

చీడిపల్లి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



చైర్మన్ కన్నంనాయుడు

చీడికాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవమైంది. గ్రామ కమిటీ పదవుల కోసం కొంత కాలంగా రెండు వర్గాలుగా నాయకులు విడిపోయారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సూచన మేరకు అందరూ సమావేశమై ఏకతాటిపైకి వచ్చారు. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా మతల కన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా కిర్ల ఈశ్వరరావు, బూత్ కమిటీ అధ్యక్షుడిగా పల్లి తాతబాబు, కార్యదర్శిగా గొర్లి రామునాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు వంటాకు సూర్యనారాయణ, వేచలపు ఎర్రునాయుడు, డోకల దేముడుబాబు, అక్కునాయుడు, దేముడుబాబు, రెడ్డి తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ భూముల కౌలు వేలం

చోడవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక భమిడిపాటి సత్రం, గవరవరం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలకు చెందిన భూములకు ఈ నెల 14, 15 తేదీలలో కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీ.సత్యనారాయణ తెలిపారు. 14న ఉదయం 11 గంటలకు చిట్టియ్యపాలెం రామాలయం వద్ద, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు హార్డింజి అతిథి గృహం వద్ద భమిడిపాటి సత్రం భూములకు వేలం ఉంటుందని చెప్పారు. 15న గవరవరం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం భూములకు గవరవరంలోని ఆలయం వద్ద వేలం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ కౌలు వేలంలో పాల్గొనాలని సూచించారు.

26 నుంచి స్వయంభూ విఘ్నేశ్వర మాలధారణ

చోడవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరస్వామి మాలధారణ మండల దీక్షా కార్యక్రమం ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ప్రధానార్చకులు కొడమంచిలి చలపతి తెలిపారు. ఈ కార్యక్రమం సెప్టెంబరు 9వ తేదీ వరకూ కొనసాగుతుందని చెప్పారు. వీటితో పాటు స్వామి ఏకాదశ, అర్థ మండల, నవరాత్రి దీక్షలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి దీక్షలు చేపట్టాలని ఆయన కోరారు.

నేడు ప్రత్యేక వైద్య శిబిరాలు

దేవరాపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరబ్బ గ్రామంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఈ శిబిరాల్లో గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఎముకులు, కీళ్ల నొప్పులు, కంటి జబ్బులు, పిల్లలు, స్త్రీ సంబంధ సమస్యలకు ప్రత్యే వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు చేయనున్నట్టు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని వారు చెప్పారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మాడుగుల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయడానికి కెమిస్ట్రీ పోస్టు కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తులను సోమవారం మధ్యాహ్నం 3 గంటలలోపు కళాశాలలో అందజేయాలని ఆయన సూచించారు.

నాతవరం బాలికల వసతిగృహానికి మేట్రిన్‌ను నియమించాలి

నాతవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల వసతిగృహానికి పూర్తి స్థాయి మేట్రిన్‌ను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. రెండేళ్లుగా ఈ హాస్టల్‌కు పూర్తి స్థాయి మేట్రిన్ లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు. నాతవరం ప్రాథమిక పాఠశాల టీచర్ రత్నంకు ఇన్‌చార్జి మేట్రిన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆ సమయంలో విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టడం లేదన్న ఆరోపణలు రావడంతో బాధ్యతల నుంచి ఆమెను అధికారులు తొలగించారు. తర్వాత తాండవ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పనిచేసే టీచర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది జూన్‌లో ఆమె మరలా తాండవ గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లిపోవడంతో పోస్టు ఖాళీ అయిపోయింది. దీంతో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో పనిచేసే వార్డెన్ శివకు ఇక్కడికి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారని, పూర్తిస్థాయి మేట్రిన్‌ను నియమించి బాలికలు ఇబ్బంది పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రావికమతం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.వెంకన్నబాబు కోరారు. ఈ నెల 15న జెడ్.బెన్నవరం, 16న పి.పొన్నవోలు, 17న దొండపూడి, 22న గొంప, 23న గుడివాడ, 24న కన్నంపేట, 25న జెడ్.కొత్తపట్నం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయని చెప్పారు. అలాగే ఈ నెల 18న కొత్తకోట ఉన్నత పాఠశాల వద్ద కేంద్రం నిర్వహిస్తామన్నారు. ఆధార్ నమోదుకాని పిల్లలు ఉంటే ఈ కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

పోస్ట్‌మాస్టర్ విధులకు డుమ్మా

కార్యాలయంలో నిలిచిన కార్యకలాపాలు

బుచ్చెయ్యపేట, జూలై 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది ఉప తపాలా కార్యాలయంలో పోస్ట్ మాస్టర్ శనివారం విధులకు డుమ్మా కొట్టారని వినియోగదారులు గగ్గోలు పెట్టారు. మండల కేంద్రంలోని అన్ని సబ్ పోస్టాఫీసులల్లో కీలకంగా ఉండే ఈ కార్యాలయంలో పోస్ట్‌మాస్టర్ నాగేశ్వరరావు రెండు రోజులుగా విధులకు హాజరుకావడం లేదని వారు తెలిపారు. ఫలితంగా వడ్డాది గ్రామస్థులతో పాటు పలువురు వినియోగదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఖాతాదారుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ దివాకర్ విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులు ఇస్తామని తెలిపారు.

యువత నైపుణ్యానికి మెరుగులు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ప్రభుత్వ రంగ సంస్థలకు సూచించింది. దీనిలో భాగంగానే హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ద్వారకా కాంప్లెక్సులోని ఐదు అంతస్తుల భవనంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని 2016 మేలో ఏర్పాటు చేసింది. సంస్థ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ భాగం దీనికి వినియోగిస్తోంది. అప్పటి నుంచి వేలాదిమంది యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చి వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి కల్పించింది. ఇప్పటి వరకు 23 వేల మంది నైపుణ్య శిక్షణ పొందారు. ఇందులో 78 శాతం మంది 150కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. శిక్షణ పొందిన వారిలో 22శాతం మంది మహిళలున్నారు.

జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ ఉంటుంది. వ్యక్తిత్వ అభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, నగదు నిర్వహణ, ఇంటర్వ్యూ సంసిద్ధత, ఉపాధి శిక్షణలో ఇస్తున్నారు. ప్రయోగశాల, బోధనా సహాయాలు, వినియోగ వస్తువులు, ముడిపదార్థాలు సంస్థ సమకూరుస్తుంది. ట్రైనీల కోసం ఇండక్షన్ కిట్, టోట్ సర్టిఫికేషన్ కలిగిన ట్రైనర్లతో శిక్షణ ఇస్తున్నారు.ఏసీ తరగతిగదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సోలార్ హీటర్లు, 160 సీటింగ్ కెపాసిటీ కలిగిన ఆడిటోరియం, లైబ్రరీ, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉన్నాయి.

హెచ్‌పీసీఎల్‌లో ఉచిత శిక్షణ

» నిరుద్యోగుల ఉపాధికి ఊతం



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

అందిస్తున్న కోర్సులు

ప్లంబర్ (జనరల్), ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్, రిటైల్ అవుట్‌లెట్ అటెండెంట్, ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్, ప్యాకింగ్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, రిటైల్ సేల్స్ అసోసియేట్, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్, ఎల్‌పీజీ మెకానిక్, మల్టీఫంక్షనల్ అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, మెయింటినెన్స్, మెకానికల్, ఫిట్టింగ్ అసిస్టెంట్, ఫ్యాబ్రికేషన్ ఫిట్టర్, ఇండస్ట్రియల్ వెల్డర్, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డర్, పైపు ఫిట్టర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్యూటీషియన్, ఫుడ్, బేవరేజెస్ అసోసియేట్ వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు.



ఇండస్ట్రియల్ వెల్డర్



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో తరగతులు



హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు

అర్హత, సౌకర్యాలు

హెచ్‌పీసీఎల్ నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ, ఉపాధి పొందేందుకు 18 నుం చి 27 సంవత్సరాల మధ్య వయసువారు అర్హులు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారికి నైపుణ్యం పెంచేందుకు, ఉపాధి కల్పించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చేరిన వారికి ఉచిత శిక్షణ, వసతి భోజన సదుపాయం కల్పిస్తుంది. అధ్యయన సామగ్రి కూడా ఉచితంగానే అందిస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఐఎన్‌ఓ గుర్తింపు కలిగిన ధ్రువపత్రాలు అందజేస్తారు.

సాధించిన అవార్డులు

స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఇప్పటి వరకు పలు అవార్డులు సాధించింది. అసోచాం స్కిల్ అచీవర్స్ అవార్డును వరుసగా మూడుసార్లు సాధించింది. కమ్యూనిటీ ఇంపాక్ట్‌లో ఎక్సలెన్స్‌కు ఎస్‌హెచ్‌ఆర్‌ఎం అవార్డు సాధించింది. గ్రీన్‌టెక్ ఫౌండేషన్ నుంచి సీఎస్ఆర్ ఇండియా అవార్డును వరుసగా మూడుసార్లు సాధించింది. గ్రోకేర్ ఇండియా సీఎస్ఆర్ ఎక్సలెన్స్ నుంచి ప్లాటినం అవార్డు పొందింది.

నైపుణ్యాన్ని జోడిస్తున్నాం



యువతలో నైపుణ్యాన్ని వెలికితీసి దానికి మరింత పదును పెడుతున్నాం. యువత అర్హత, ఆసక్తిని గుర్తించి అందుకు అనుగుణంగా వారికి ఉచితంగానే శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కాలంలో విద్యార్థులకు భోజన వసతి, అధ్యయన సామగ్రిని సంస్థే సమకూరుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాం. దేశానికి నైపుణ్యం కలిగిన యువతను అందిస్తున్నామన్న సంతృప్తి పొందుతున్నాం.

- ఇంతియాజ్ అర్షద్, సీఈఓ, స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్

నచ్చిన రంగంలో శిక్షణ, ఉపాధి



నిరుద్యోగ యుతకు నచ్చిన రంగాల్లో స్కిల్‌డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నాం. ఫుడ్ అండ్ బేవరేజెస్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాం.

-సీహెచ్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బొల్లినేని మెడ్‌స్కిల్స్

అక్రమంగా తరలిస్తున్న చికెన్ వ్యర్థాల వాహనాలు స్వాధీనం



జీవీఎంసీలో ఉన్న వాహనాలు

అనకాపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న మూడు వాహనాలను శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. విజయనగరం నుంచి తునికి వ్యాన్‌ల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్టు కలెక్టర్‌కు అందిన సమాచారం మేరకు పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు కలిసి జాతీయ రహదారిలోని డైట్ కళాశాల ఎదుట మూడు వాహనాలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేస్తుంటారని ఆయన తెలిపారు. వాహనాలను జీవీఎంసీ అధికారులకు అప్పగించగా వారు విశాఖకు తరలించారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ఆందోళన

» రాజయ్యపేటలో నిరసన ప్రదర్శన

» చిరు వ్యాపారికి రూ.63,996 విద్యుత్ బిల్లు

» ఎలా చెల్లించగలడని నాయకుల మండిపాటు

నక్కపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, అందువల్ల వీటిని ఏర్పాటు చేయవద్దంటూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాజయ్యపేటలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల నిరుపేదలు, చిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజయ్యపేటలో ఒక బేకరీ షాపులో ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్‌ను అమర్చిందన్నారు. అయితే ఆ చిరు వ్యాపారికి ఏకంగా రూ.63,996 విద్యుత్ బిల్లు రావడంతో ఆయన ఎలా చెల్లించగలడని మండిపడ్డారు. అందువల్ల స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజేశ్, మహేశ్‌బాబు, కోడా కాశీరావు, భైరాగిరాజు, ఎం.బాపూజీ, ఎం.జాన్, వై.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

నక్కపల్లి ఆస్పత్రికి నూతన హంగులు

... 5వ పేజీ తరువాయి

రావాల్సి ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

సీ-ఆర్మ్ మిషన్‌తో ఆర్థో సేవలు

నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సేవలకు గాను గత ఏడాది డాక్టర్ రవి కిరణ్‌కు ఉత్తమ సేవా పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. ఇటీవల కాలంలో రికార్డు స్థాయిలో ఆర్థోపెడిక్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. గత ఏడాది జూలైలోనే అతి తక్కువ రోజుల్లో 30 ఆపరేషన్లు చేసి రాష్ట్రంలోనే నక్కపల్లి సీహెచ్‌సీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఆర్థో సేవలను మరింత విస్తృతపరిచేందుకు ప్రభుత్వం సుమారు రూ.20 లక్షల విలువైన సీ-ఆర్మ్ మిషన్‌ను సమకూర్చింది. ఆర్థోపెడిక్ ఆపరేషన్లు చేసేటప్పుడు నేరుగా మోనిటర్‌లో రోగుల శరీరంలో అంతర్గత అవయవాలను చూస్తూ శస్త్రచికిత్సచేసే అవకాశం కలుగుతుంది.

52 కనెక్షన్లతో ఆక్సిజన్ ప్లాంట్

సీహెచ్‌సీకి విచ్చేసే రోగులు అత్యవసర సమయంలో ఆక్సిజన్ లేక ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను సుమారు 52 కనెక్షన్లతో అధునాతనమైన ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని వార్డుల్లో పేషెంట్లు ఉండే బెడ్‌ల వద్ద ఇప్పటికే ఆక్సిజన్ కనెక్షన్లను ఇచ్చారు. ఆక్సిజన్ సిలిండర్ల కోసం ఒక షెడ్డును కూడా నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే ఆక్సిజన్ సరఫరా ప్రతీ రోగి బెడ్ వద్దకు ఏర్పాట్లు చేస్తారు. ఈ సదుపాయాన్ని సుమారు రూ.15 లక్షల వ్యయంతో డెక్కన్ పరిశ్రమ కల్పిస్తోంది.

అదేవిధంగా స్థానిక హెటిరో ఔషధ పరిశ్రమ కూడా మరో రూ.15 లక్షల వ్యయంతో అధునాతనమైన ఈఎన్‌టీ పరికరాలను, ఆస్పత్రికి అవసరమైన పెయింటింగ్‌లను సమకూర్చింది. ఈ పెయింటింగ్‌లు చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. అంతేకాక హెటిరో ఔషధ పరిశ్రమ 30కేవీ జనరేటర్‌ను కూడా ఆస్పత్రికి అందజేయనున్నట్టు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ తెలిపారు. త్వరలో రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత నక్కపల్లి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కొత్త పరికరాలను, ఆక్సిజన్ ప్లాంటును ప్రారంభిస్తారని ఆయనన్నారు.

రోగులకు మరిన్ని మెరుగైన సేవలు

-డాక్టర్ శిరీషా, సూపరింటెండెంట్

నక్కపల్లి సీహెచ్‌సీలో కొత్తగా ఏర్పాటు చేసిన అధునాతన పరికరాల వల్ల అత్యవసర సమయాల్లో రోగులకు సకాలంలో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం కలుగుతుంది. ఎక్స్‌రే ప్లాంట్, సీ-ఆర్మ్ పరికరాలకు సంబంధించి టెక్నికల్ సిబ్బంది వచ్చి కనెక్షన్లు, తదితక ఏర్పాట్లు చేయాలి. ఆక్సిజన్ ప్లాంట్ ఆస్పత్రికి సొంతంగా ఉండడం వల్ల రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలు?

... 5వ పేజీ తరువాయి

తెలుస్తుంది. వారే కూలీలను పెట్టి తవ్వకాలు జరిపించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ మేరకు శనివారం నర్సీపట్నం రేంజ్ అధికారి రాజేశ్వరరావు కరక రంగురాళ్ల క్వారీని సందర్శించారు. బేస్ క్యాంప్ సిబ్బందిని విచారించారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలు జరిపిన చెదురు క్వారీ, బొగ్గు క్వారీ, టెంట్ క్వారీ, తాటిచెట్ల క్వారీలను ఆయన పరిశీలించారు. అక్కడ తవ్వకాలు జరిపినట్టు ఎటువంటి ఆనవాళ్లు లేవని రేంజర్ పేర్కొన్నారు. కాగా జనవరి 31న ఇద్దరు రంగురాళ్ల వ్యాపారులను తీసుకుని మైనింగ్ అధికారులు కరక కొండపై సర్వే చేశారు. అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా మైనింగ్ అధికారులను రేంజ్ కార్యాలయానికి పిలిపించి రెండు రోజులపాటు విచారణ కూడా జరిపారు. అయితే నిషేధిత రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉన్న కరక కొండ పైకి వెళ్లిన మైనింగ్ అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

తాజాగా మళ్లీ కరక రంగు క్వారీలో తవ్వకాలు జరిపినట్టు సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. దీనిపై రేంజర్ రాజేశ్వరరావును వివరణ కోరగా.. కరకలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయన్నారు. ఎవరైనా అక్రమంగా తవ్వకాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరక కొండపై రెండు బేస్ క్యాంపులు, స్ట్రైకింగ్ ఫోర్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

పురావస్తు శాఖ ఆధీనంలో అల్లూరి సమాధి



కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కు

... 5వ పేజీ తరువాయి

ఇతర చారిత్రాత్మక అవశేషాలను పరిరక్షించి, వాటిని భవిష్యత్త తరాల కోసం భద్రపరచడం పురావస్తు శాఖ ముఖ్యమైన విధి. అయితే ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు, గంటం దొర సమాధులు పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న విషయం ఎవరికీ తెలియదు. రెండు రోజులు క్రితం నర్సీపట్నం మెయిన్ రోడ్డులో ఉన్న బ్రిటీష్ అధికారులు సమాధుల స్థలాన్ని న్యాయమూర్తి షియాజ్‌ఖాన్ పరిశీలించడానికి వచ్చినప్పుడు ఆయన వెంట పురావస్తుశాఖ ఏడీ కూడా ఉన్నారు. ఆయనే మాటల సందర్భంగా అల్లూరి, గంటందొర సమాధులు పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నట్టు వెల్లడించారు. ఆయన చెప్పేంత వరకు ఈ విషయం ఎవరికీ తెలియకపోవడం గమనార్హం.

స్వచ్ఛ విశాఖ

... 5వ పేజీ తరువాయి

మినిస్టీరియల్ అవార్డు రాజమండ్రికి, పది లక్షల జనాభా పైబడిన కేటగిరీలో విజయవాడ, మూడు లక్షలు పైబడిన జనాభా కేటగిరీలో గుంటూరు, మూడు లక్షలలోపు జనాభా గల నగరాల కేటగిరీలో తిరుపతి సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డులు గెలుచుకున్నాయన్నారు. ఏ నగరానికి ఏ ర్యాంకు లభించింది?, కేటగిరీ వారీగా ఎన్నిమార్కులు వచ్చాయనే వివరాలను వెల్లడించలేదు. 19న పూర్తివివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

రాంబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గుడాల చర్విక్(4) మృతి చెందాడని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. మండలంలోని ఎస్‌ఏటీబీ కాలనీకి చెందిన గుడాల జీవన్ కుమార్ తన భార్య కసిరత్నం, కుమారుడు గుడాల చర్విక్‌తో కలిసి ఈనెల 11న ఉదయం మోటారు సైకిల్‌పై రాంబిల్లి నుంచి విశాఖపట్నం వెళుతుండగా.. వెంకటాపురం జంక్షన్ వద్ద బైక్‌ను వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టిందన్నారు. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న వారు రోడ్డుపై పడిపోవడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. వీరిని అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం బాలుడు చర్విక్, అతని తల్లి కసిరత్నంలను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారని చెప్పారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బాలుడు చర్విక్ అదేరోజు సాయంత్రం మృతి చెందాడన్నారు. బాలుడు తండ్రి గుడాల జీవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి



మృతి చెందిన వెంకటేష్

రావికమతం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టి.అర్జాపురానికి చెందిన యువకుడు శనివారం మృతి చెందాడు. మండలంలో టి.అర్జాపురానికి చెందిన ఆరి వెంకటేష్ (28) ఈనెల 7న నర్సీపట్నం నుంచి ద్విచక్రవాహనంపై టి.అర్జాపురం వస్తుండగా కొత్తకోట గజాల కట్టు సమీపంలో గోతుల వద్ద వాహనం బోల్తా పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన యువకుడిని కొత్తకోట పోలీసులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు విశాఖపట్నం ప్రయివేటు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వెళ్లారు. అక్కడ రెండు రోజుల పాటు చికిత్స అందించగా.. పరిస్థితి మరింత విషమించడంతో విశాఖలోనే మరో ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా యువకుడి ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో యువకుడిని తిరిగి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడుకి తల్లిదండ్రులతో పాటు భార్య సహస్ర, రెండేళ్ల కుమారుడు రోహిత్ ఉన్నారు. భార్య ప్రస్తుతం ఎనిమిదో నెల గర్భవతి. మృతుడు వెంకటేష్ సరుగుడు కర్రల వ్యాపారి వద్ద సహకుడుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భర్తను కోల్పోయి భార్య సహస్ర భోరున విలపిస్తున్నది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యభిచారం కేసులో ఆరుగురి అరెస్టు

కూర్మన్నపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కూర్మన్నపాలెంలోని నేహా విలాస్ భవన్‌లో శుక్రవారం రాత్రి దువ్వాడ పోలీసులు దాడి చేసి వ్యభిచారం నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెంలో జాతీయ రహదారికి ఆనుకొని నేహా విలాస్ భవన్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. మూడు గదుల్లో వ్యభిచార కార్యక్రమాలు జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. నర్సీపట్నానికి చెందిన దేవరపు దుర్గాప్రసాద్ ఒక మహిళను తీసుకొని లాడ్జికి వచ్చాడని సీఐ తెలిపారు. తర్వాత 3 రూములు తీసుకొని ఓ రూమ్‌లో మహిళను, మరో రెండు రూముల్లో విటులు అరవింద్, పైడిరెడ్డి, శ్రీనివాస రెడ్డి,పెంటయ్య లను ఉంచి వ్యాపారం నిర్వహిస్తుండగా పట్టుకున్నట్టు సీఐ తెలిపారు. విటులతో పాటు నిర్వాహకుడు దుర్గాప్రసాద్, రిసెప్షనిస్టు పూర్ణచంద్ర బిసాయ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. మహిళను హోమ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

శారదా నదిలో మునిగి ఒకరి మృతి

రాంబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పసుల సూరిబాబు (50) శనివారం శారదా నదిలో మునిగిపోయి మృతి చెందాడని రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఉదయం సుమారు 9.30 గంటలు ప్రాంతంలో సూరిబాబు నదిలో స్నానం చేస్తుండగా పడిపోయి మృతి చెందాడన్నారు. సమీపంలో ఉన్న కొందరు వ్యక్తులు గమనించి మృతుడు భార్య పసుల సుధకు సమాచారం ఇచ్చారన్నారు. ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు తన భర్త సూరిబాబుగా గుర్తించిందన్నారు. భార్య సుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

త్వరలో అల్లూరి జిల్లాలో ఇగ్నో అధ్యయన కేంద్రం

ఎంవీపీ కాలనీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లాలో త్వరలో ఇగ్నో అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ సీనియర్ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేంద్ర ఏర్పాటు కోసం ఆ జిల్లాలోని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిట్టిబ్బాయితో శనివారం చర్చలు జరిపినట్టు తెలిపారు. ఆ జిల్లా, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఇగ్నో అధ్యయన కేంద్రం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కేంద్రం ద్వారా పరిసర ప్రాంత విద్యార్థులకు సర్టిఫికెట్, డిప్లొమో, డిగ్రీ, పీజీ కోర్సులు చేయడానికి అవకాశం లభిస్తుందన్నారు.

చెరకు రైతులకు సాయం ప్రశ్నార్థకం?

... 5వ పేజీ తరువాయి

క్రమంగా ఫ్యాక్టరీలో సీజన్ క్రషింగ్ తగ్గిపోతూ రావడంతో మండలి ఆదాయం కూడా పడిపోయింది. గత ఏడాది లక్షా 61 వేలు ఆడిన గోవాడ, ఈ ఏడాది చివరగా కేవలం లక్షా 9 వేల టన్నులతోనే ఆగిపోయింది. దీని వలన ఈ ఏడాది మండలికి కేవలం రూ.8 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. ఈ నిధులతోనే పరిమితంగానే పురుగు మందులు, మడత పైపులు కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేసి మమ అనిపించారు.

వచ్చే సీజన్‌కు కష్టమే..

ఇక ఈ ఏడాది గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ దాదాపుగా నిలిచిపోవడంతో చెరకు అభివృద్ధి మండలికి నిధులు ప్రశ్నార్థకంగా మారింది. గోవాడ ఫ్యాక్టరీకే ఆదాయం తగ్గడంతో చెరకు అభివృద్ధి మండలికి నిధులు వచ్చే దారి మూసుకుపోయినట్టుగా భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చెరకు అభివృద్ధి మండలి ద్వారా రైతులకు అందే సహకారం కూడా అనుమానంగానే ఉంది. చెరకు అభివృద్ధి మండలి ద్వారా ఈ ఏడాది రైతులకు అందిన పురుగు మందులు, పరికరాలే చివరివి అన్న అభిప్రాయం రైతాంగం నుంచి వ్యక్తమవుతున్నది.

నమ్మించి నట్టేట ముంచేశాడు

... 5వ పేజీ తరువాయి

ప్రతినెలా వడ్డీలు చెల్లించేలా సుమారు 15 కోట్ల రూపాయలను అప్పుగా తీసుకున్నాడు. ఆరంభంలో నెలనెలా వడ్డీ క్రమం తప్పకుండా చెల్లిస్తూ ఎంతో నమ్మకంగా ఉండేవాడని బాధితులు తెలిపారు. ఆ తరువాత నుంచి ఇదిగో.. అదిగో అంటూ తప్పించుకు తిరిగేవాడని, ఇప్పుడు ఏకంగా పరారైపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో ఎక్కువగా మహిళలు, వృద్ధులు, కూలి పని చేసుకునే వారే ఉన్నారు. పలువురు మహిళలు తమ పిల్లల పెళ్లిళ్ల సమయానికి నగదు ఆసరాగా ఉండడంతో పాటు వడ్డీలు అధికంగా ఇస్తుండడంతో అప్పులిచ్చి ఇప్పుడు మోసపోయామని బావురుమంటున్నారు. కొంతమంది బాధితులు బంగారు ఆభరణాల కోసం అడ్వాన్స్‌గా నగదు చెల్లించామని చెబుతున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో బాధితులు కూనిశెట్టి నాగేశ్వరరావు, యగదాసు గంగారావు, యు.సత్యవతి, ఎన్.సుధ, వై.బేబి, వై.కుమారి, నారాయణలక్ష్మి, హరికృష్ణ, గంగాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544